


14

## సామూహిక వివాహాలకు వెడ్మ ఫౌండేషన్ విరాళం


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 15 ఫిబ్రవరి 2026 | ■ 14 పేజీలు




## సల్లంగ సూడు జంగమయ్యా

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఉమ్మడి జిల్లాలోని ప్రాచీన శైవ క్షేత్రాలు

ఓం నమఃశివాయ... శివోహం.. శివోహం..

జయ జయ శంకర.. భక్త శుభంకర

# శివోహం..

- హరహర మహాదేవ శంభో శంకర
- శివనామస్మరణతో మార్మోగనున్న శైవక్షేత్రాలు
- రాత్రి నుంచే శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా మహా శివరాత్రి ఏర్పాట్లు
- ఆలయాల్లో పూజలకు సర్వం సిద్ధం..
- ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ఈస్గాం మల్లన్న క్షేత్రంలో కల్యాణోత్సవం..
- మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న భక్తులు
- పటిష్ట బందోబస్తు చేపట్టిన యంత్రాంగం

లోపలి పేజీల్లో

శివ.. శివ.. శంకరా.. శంభో.. శంకరా అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో భక్తులు శివున్ని ఆరాధించేందుకు సిద్ధమయ్యారు. మహా శివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శివాలయాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. శివ నామస్మరణతో శైవ క్షేత్రాలు మారుమోగాయి. శివలింగానికి, నందీశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందకు గాను ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పరమ శివునికి ప్రీతిపాత్రమైన బిల్వపత్రాలను సమర్పించుకొని 'ఓ జంగమయ్యా.. ఇహపర ఐహికాలు తొలగించయ్యా' అని వేడుకొనున్నారు. ఆది భిక్షుడవు, బూడిదతోనే తృప్తి చెందేవాడవు.. మారేడు దళానికే మురిసిపోయే శంకరుడి కల్యాణ వేడుకలు చూసి చాలదా.. ఈ జన్మ అని భక్తులు మురిసిపోనున్నారు. ముక్కంటికి అత్యంత ప్రీతీకరమైన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓలలాడనుంది. పలు శివాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పూజలు, రుద్రాభిషేకాలు, లింగార్చనలు నిర్వహించనున్నారు.




11

## మేయర్ పదవి వరించేదెవరినో..!

- మంచిర్యాల కార్పొరేషన్‌లో టెన్షన్
- ఇప్పటికీ ఖరారుకాని పేర్లు..
- మున్సిపాలిటీల్లోనూ పూర్తికాని అభ్యర్థుల ఎంపిక
- రేపు మున్సిపల్ మేయర్, చైర్మన్‌ల ఎన్నిక
- చేతులెత్తడం ద్వారా మేయర్, చైర్మన్‌ల ఎంపిక

మునిసిపల్ ఎన్నికలు ముగిసి, ఫలితాలు కూడా వెల్లడికాగా, ఇక మేయర్, చైర్మన్ పదవుల భర్తీ చేపట్టవలసి ఉంది. శివరాత్రి సందర్భంగా సెలవుదినడం కావడంతో ఆ ప్రక్రియను ఎన్నికల కమిషన్ సోమవారం చేపట్టనుంది. మంచిర్యాల కార్పొరేషన్ తోపాటు బెల్లంపల్లి, చెన్నూరు, క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీలకు మేయర్, చైర్మన్‌ల ఎన్నిక ఈనెల 16న చేపట్టనుండగా, ఆ పదవులను ఎవరు అలంకరిస్తారోనన్న టెన్షన్ విజేతలతో పాటు ప్రజల్లోనూ ఉంది. మంచిర్యాల కార్పొరేషన్, చెన్నూరు, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, క్యాతన్‌పల్లి మునిసిపాలిటీల్లో కలెక్టర్ సమక్షంలో సోమవారం మధ్యాహ్నం చైర్మన్లు, మేయర్ పదవుల ఎన్నిక జరుగనుంది.



2

## క్రీడలతో మానసికోల్లాసం

- గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సహించేందకు సీఎం కప్ పోటీలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



# గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సహించేందకు సీఎం కప్ పోటీలు





- క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు
- క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం..
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు అలవాడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న సిఎం కప్ 2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, క్రీడలతో ప్రశాంతత అలవాటు అవుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో టీం వర్క్ ప్రాధాన్యత తెలుస్తుందని, కలిసి పని చేయడంతో ఏదైనా సాధించవచ్చు తెలిపారు. క్రీడలలో గెలుపు, ఓటములు సామాన్యమని, క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని తెలిపారు. ఒకసారి ప్రయత్నించి రాలేదు అని నిరుత్సాహపడకుండా సాధించే వరకు ఫలితం ఆశించకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని తెలిపారు. సి.ఎం. పోటీలలో భాగంగా గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ ఇతర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సిబ్బంది సహకారం తక్కు వగా ఉన్నప్పటికీ జిల్లాలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఒలంపిక్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చు అని, క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి



**నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి**
**జిల్లా వయోజన విద్యాధికారి అజ్మీర పురుషోత్తం**

**దండేపల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
గ్రామాల్లోని మహిళ సంఘాల సభ్యుల్లో నిరక్షరాస్యులుగా ఉన్న వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అమ్మకు అక్షర మాల ఉల్లాస్ అక్షర కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వయోజన విద్యాధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మా మిడిపల్లిలో ఉల్లాస్ అక్షరాస్యత వయోజన విద్యా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడు తూ నిర్లక్షరాస్యులకు అక్షరాలలు దిద్ది చదువు నేర్చు కోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 ఏళ్లు నుంచి 60ఏళ్లు వరకులోపు వారందరు చదువురాని వారు చదువుకోవాలన్నారు. చదువుకునే వారికే సమా జంలో మంచి గౌరవ ఉంటుందన్నారు. ఉల్లాస్ పథకం ద్వారా చదువురాని వారికి అక్షరాస్యత కేంద్రాలకు నిర్లక్షరాస్యులను ప్రతి ఒక్కరూ రావడమే కాకుండా చదువు నేర్చుకోకుని 100రోజుల్లో అక్షరాస్యులుగా తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఉల్లాస్ అమ్మకు అక్షరమాల కేంద్రాలు సమర్థవంతంగా కొన సాగడానికి ప్రతి మండల విద్యాధికారులు మండల స్థాయి, గ్రామస్థాయిలో మానిటరింగ్ చేసి ప్రతి వా రం మండలస్థాయిలో గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రగతి నివేదికలను జిల్లా విద్యాధికారి కార్యలయాలు, వయోజన విద్యా కార్యలయాలకు అందజేయాలన్నారు. అనంతరం నిరక్షరా స్యులతో అక్షర వికాసం వాచకం ద్వారా నేర్చుకున్న ఐదు పాఠాల వరకు అభ్యాసకుల వారి ద్వారా చదివించి రాయించి పరిశీలించారు. ఇందులో కొంత మంది చక్కగా తప్పులు లేకుండా చదవగలిగారు. కొంత మంది చిన్నచిన్న లెక్కలు సులభంగా చేయగలిగారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి వివో, ఓబి, వివోఏల తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు వారిని అభినందించారు. ఇలాగే ముందు ముందు కూడా వంద రోజుల్లో అక్షరాస్యులుగా తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్తెపు వైష్ణవి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, రిటైడ్ ఎంఈవో నాగేమల్లేశ్వర్ రావు, డిఆర్‌పిలు కొండు జనార్ధన్, రెడ్డిమల్ల ప్రకాశం, వివో సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్‌లో నైతిక విజయం మాదే

**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కృత్రిమ విజయాన్ని మాత్రమే సాధించిందని, నైతిక విజయం బీజేపీ దేనని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించిన నిర్మల్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 1 సీటుతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల్లో 13 సీట్లు కైవసం చేసుకుందన్నారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మూడు పార్టీలు ఒక్కటైమేక పోతూ గాంభీర్యం ప్రదర్శించిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేసి 27 వేల ఓట్లు సాధిస్తే, బీజేపీ 20 వేల 335 ఓట్లు సాధించిందన్నారు. మైనార్టీ ఓటు బ్యాంకుతోనే కాంగ్రెస్ పార్టీ గెలుపొందిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, చిన్నయ్య, నారాయణ రెడ్డి, శివకుమార్, సాధాం అరవింద్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న జడ్జీ యువరాజ్

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని ఆసిఫాబాద్ సివిల్ కోర్టు సీనియర్ జడ్జీ యువరాజ్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించి జడ్జీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఉపాధి హామీ కూలీలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ వర్కర్లకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేష్ వర్కర్లకు బ్యాంకింగ్ లావాదేవీలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఖాతాల వినియోగం, కేవైసీ ప్రాముఖ్యత, డిజిటల్ లావాదేవీలు, కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై గురించి అవగాహన కల్పించారు. అలాగే డీఈఏ ఫండ్, నామినీ నమోదు అవసరం, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోసం జరిగినప్పుడు వెంటనే ఫిర్యాదు చేయాల్సిన 1930 హెల్ప్‌లైన్ నంబర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రౌతు శేఖర్, ఎల్లంకి రాజబాబుతో పాటు ఎల్కపల్లి గ్రామ పంచాయతీ



సీనియర్ మేట్ మహంకాళి శ్రీశైలం పాల్గొన్నారు.

# నిర్మల్ ప్రజలకు కృతజ్ఞతలు

**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



మున్సిపల్ ఎన్నికల్లో నిర్మల్ మున్సిపాలిటీలో అత్యధిక స్థానాలు గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిం చడం వలన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో 24కౌన్సిలర్ స్థానాలు గెలిపించి చైర్మన్ పీఠాన్ని అప్పగించిన ప్రజలకు పార్టీ అందుబాటులో ఉండి ప్రజాపాలన కొనసాగిస్తామన్నారు.

# పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
పెంచికలపేట మండల కేంద్రంలోని పీఎం జెడ్పీఎస్ఎస్ పెంచికలపేట పాఠశాలలో బ్యాంకింగ్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా బ్యాంకులు అందించే వివిధ సేవలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, లక్ష్మీ, భారతి, ఉజ్వల, భాగ్యశ్రీ, ఆత్మారామ్, సమ్మయ్య, షేక్ బడే సాహెబ్, సంతోష్, విజయ్, మౌనిక పాల్గొన్నారు.



# ప్రతిష్టాత్మకం.. పుర పీఠం..!




- బెల్లంపల్లిలో హస్తం, గులాబీ వార్
- కాంగ్రెస్‌కు ధీటుగా బీఆర్ఎస్ నేతల వ్యూహం
- కాంగ్రెస్ వైపు స్వతంత్రుల అడుగులు..?
- కొనసాగుతున్న క్యాంపు రాజకీయాలు
- ముగ్గురి చేరికతో మారిన సమీకరణాలు
- బెల్లంపల్లి బీఆర్ఎస్‌దేనంటున్న విశ్లేషకులు..





**బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మున్సిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఫలితాల్లో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ సమ ఉజ్జీవులుగా చాటుకున్నాయి. అధికార పార్టీ వెంట ఫలితాల పరుగులో బీఆర్ఎస్ పరిగెత్తి దీటుగా నిలిచింది. 34 స్థానాల్లో 14 చొప్పున పంచుకొని కాంగ్రెస్‌కు తాము ఏ మాత్రం తీసిపోమని బీఆర్ఎస్ నిరూపించుకుంది. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు, బీజేపీ ఒక స్థానంలో గెలిచి తమ ఉనికిని చాటుకొన్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ 6 స్థానాల్లో మాత్రమే పోటీ చేసింది. ప్రజలు కామ్రేడ్లను విశ్వసించలేదు. పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. బీజేపీ హిందుత్వం పారలేదు. 20 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ వారిని ప్రజలు పెద్దగా ఆదరించలేదు. ఒక్క స్థానంలో నిలిచి కొనఊపిరికి చేరింది.. సీపీఐ, బీజేపీ కంటే ఈ ఎన్నికల్లో స్వతంత్రులనే ప్రజలు కీలక స్థానంలో నిలబెట్టారు. చైర్మన్ ఎవరికి ఇవ్వాలో స్వతంత్రులే నిర్ణయాత్మక పాత్రలో కిరోల్‌గా మారారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫలితాల్లో పోటీపడిన నేపథ్యంలో చైర్మన్ పీఠం ప్రతిష్టాత్మకంగా మారింది. మెజార్టీ కోసం స్వతంత్రుల మద్దతు కోసం జోరుగా బీరసరాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ విషయంలో ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నారు. ఐదుగురు స్వతంత్రులలో ఇప్పటికే 2 వార్డు స్వతంత్ర అభ్యర్థి గా గెలుపొందిన నిచ్చకోల వంశీ కృష్ణ కాంగ్రెస్ శిబిరంలోకి వెళ్లారు. మిగిలిన నలుగురు టార్గెట్ గా సమీకరణలు జోరందుకున్నాయి. ఈ నలుగురు ఎటువైపు అనేది ఆసక్తిగా చర్చ జరుగుతుంది. బీజేపీ స్టాండ్ ఏంటనేది అంత చిక్కడం లేదు. మద్దతు కూడ కట్టుకునే ప్రక్రియలో అధికార పార్టీ ఒక అడుగు ముందుంజలో ఉందని చెప్పొచ్చు. ఇందులో ఎవరు సక్సెస్ అవుతారు అనేదానిపై వాడి వేడిగా చర్చ జరుగుతుంది.

**చైర్పర్సన్ రేసులో ఉన్నది వీరే..**

బెల్లంపల్లి మునిసిపల్ అధికార పీఠం కోసం ప్రధాన పార్టీల నుంచి చైర్మన్ గిరిని ఆశిస్తున్న వారిలోప్రధాన పార్టీల నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి ఇద్దరూ కౌన్సిలర్లు చైర్మన్ గిరికి పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 7 వార్డులో గెలుపొందిన దావస్వాతి, 28 వార్డు నుంచి నెగ్గిన చిప్ప అర్చన ఆశిస్తున్నారు. ఈ ఇద్దరు ఆశావాదులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రధాన అనుచరుల సతీమణులు కావడం గమనార్హం. దావ రమేష్ , చిప్ప మనోహర్ చైర్మన్ పీఠం కోసమే తమ సతీమణులను ఎన్నికల బరిలోకి దించారు. ఇద్దరు ఎవరికి వారే తమకే చైర్మన్ పీఠం దక్కుతుందని ధీమాతో ఉన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఎవరికి అభయ ఇస్తారో చూడాలి. ఇక బీఆర్ఎస్ నుంచి చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న వారిలో ఒక్కరే కనిపిస్తున్నారు. 18 వార్డు నుంచి గెలుపొందిన బత్తుల అనిత పేరు ప్రముఖశీగా వినిపిస్తోంది. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ సతీమణి బత్తుల అనిత బీఆర్ఎస్ నుంచి చైర్మన్ సీటు ను ఆశిస్తున్న వారిలో ఏకైకులు. కాగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుర పగ్గాలను కైవసం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీని తలదన్నే రీతిలో సమీకరణలు చేస్తున్నారు. ఎక్కడ తగ్గేదెలేదన్నటుగా చాలెంజ్ రాజకీయాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల ప్రకారంగా చూస్తే బీఆర్ఎస్ ఈ ఎన్నికలతో బలం పుంజుకుందని చెప్పచ్చు. అధికార పగ్గాలు ఒకవేళ చేజారిపోయినా గట్టి ప్రతిపక్షం పార్టీగా బీఆర్ఎస్ కీలకంగా మారుతుందని భావిస్తున్నారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రజల తరపున బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్ష గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



## రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రైతులు సభ్యులుగా చేరాలని జిల్లా సహకార శాఖ అధికారి సత్యనారాయణ కోరారు. శనివారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెర్కపల్లె గ్రామంలో ఎఫ్‌పిఓపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు కలిసి సమష్టి ప్రయోజనాల కోసం ఉత్పత్తి చేసే పంటలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి రైతులు సభ్యులుగా చేరడంతో ఆర్థికంగా బలోపేతం కావచ్చని సూచించారు. రైతులు రూ. 2వేలు వాటాగా చెల్లించి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్ సందీప్ కుమార్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ బీ సురేందర్, కార్యదర్శులు రాజేష్ గౌడ్, వెంకటస్వామి, స్టాఫ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కౌన్సిలర్లకు సన్మానం



**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించిన బీజేపీ నాయకులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌లు ఘనంగా సన్మానించారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్‌లో విజయం సాధించిన 57వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం సాధించిన గాజుల ముఖేష్ గౌడ్ తో పాటు 58వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన బోట్ల అనిత, నాలుగవ డివిజన్ కార్పొరేటర్ తోటపల్లి రాజేశ్వరి, ఆరవ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేత రాకేష్‌ను, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో ఒకటవ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన బుద్దె సిద్దార్థని, చెన్నూర్ మున్సిపాలిటీలో 10వ వార్డు కౌన్సిలర్ గర్రెపల్లి శాంత రాణిని, 18వ వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణలని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ముఖేష్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన బుగ్గ రాజరాజేశ్వరుడు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మహాశివ రాత్రి పర్వదినానికి కన్నాల మండలంలో వెలసిన శ్రీ బుగ్గ రాజరాజేశ్వర దేవాలయం ముస్తాబైంది. భక్తుల ఇలవేల్పుగా పిలుచుకునే రాజరాజేశ్వరుడి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కలగకుండా దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. అత్యవసర సేవలు అందుబాటులో ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఈ జాతర అంగరంగ వైభవంగా సాగుతుంది. వేలాది మంది భక్తులు బుగ్గజాతరకు తరలిరానున్నారు. ఆర్టీసీ బుగ్గ దేవాల యానికి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి పాత బస్టాండ్ నుంచి బుగ్గ దేవాలయానికి ప్రత్యేక బస్సు, రవాణా సదుపాయం కల్పించింది.



## పుల్వామా దాడి.. ఒక చీకటి రోజు

**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

పుల్వామా దాడి ఒక చీకటి రోజుగా దేశమంతా భావిస్తుందని, సైనికుల వల్లనే మనం దేశంలో ప్రశాంతమైనటువంటి వాతావరణంలో జీవిస్తున్నామని ఫిట్నెస్ సెంటర్ సభ్యులు ఆంజనేయులు అన్నారు. శనివారం మంచిర్యాలలోని బాలుర హైస్కూల్‌లో పుల్వామా దాడిలో చనిపోయిన జవాన్లకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువత సైనికుల అడుగుజాడల్లో నడవాలని, దేశ రక్షణకు సైనికులుగా మారాలన్నారు. బతకడం అంటే కేవలం స్టాఫ్ వేర్, లేక ప్రభుత్వ ఉద్యోగాలే కాదని, దేశాన్ని కాపాడటంలో మనం కూడా భాగస్వాములం కావాలని, యువతరం చెడు మార్గంలో నడవకుండా సన్మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ నెస్ సెంటర్ సభ్యులు డాక్టర్ నర్సయ్య, శ్రీనాథ్, రామన్, లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అశోక్, గట్టయ్య, స్వామి, ముక్త వేణు, బాక్సింగ్ అసోసియేషన్ విద్యార్థులు, వాకర్స్ పాల్గొన్నారు.

## ఉత్సవాలకు శైవ క్షేత్రాలు ముస్తాబు

**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని శివ క్షేత్రాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. జిల్లాలోని కదిలి పాపేశ్వర అన్నపూర్ణ ఆలయం గుడిసెరాల రాజరాజేశ్వర స్వామి. బుగ్గారం రాజరాజేశ్వర స్వామి పూల శివాలయం జగదీశ్వర్ వాడ ఓంకారేశ్వరాలయం చీరాల శివాలయం ఆలయాలు శివరాజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుండి భక్తులఅభిషేకాలు జరగనున్నాయి. మహాశివ రాత్రిని పురస్కరించుకొని నిర్మల్ డిపో ద్వారా బస్సులు నడుపుతున్నట్టు డిఎం పండరీ తెలిపారు.



# మొదటిసారి కౌన్సిలర్‌కు నిర్మల్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి



**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

అదృష్టం అంటేనే అప్పల కావ్యది. ఆమె కుటుంబ నేపథ్య రాజకీయం అయినప్పటికీ రాజకీయాలపై ఇప్పటివరకు అంతగా ఆసక్తి చూపలేదు. ఈసారి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ జనరల్ మహిళలకు కేటాయించడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ భార్య అయిన అప్పల కావ్యను చైర్మన్ అభ్యర్థిగా ఎంపికయ్యారు. పట్టణంలోని 36 వార్డు నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. మొదటిసారిగా కౌన్సిలర్ గా ఎన్నికైన పప్పాల కావ్యకు ఏకంగా మున్సిపల్ చైర్మన్ పదవి దక్కింది. ఆమె భర్త అయినా అప్పాల గణేష్ చక్రవర్తి నిర్మల్ మున్సిపల్ చైర్మన్గా 2014 నుంచి 2019 వరకు పని చేశారు. మొదటిసారిగా ఎన్నికై అప్పల కావ్య నిర్మల్ ప్రథమ పౌరురాలిగా ప్రజలకు సేవ చేసే అదృష్ట భాగ్యం కలిగింది. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ అప్పాల కావ్యను చైర్మన్‌గా ప్రకటించడంతో పట్టణంలోని అన్ని వార్డుల ప్రచారంలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు.

# అవగాహనతోనే సైబర్ నేరాల నివారణ సాధ్యం

**సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి - వారం రోజుల్లో 16 కేసులు నమోదు**

**ఆర్థిక నేరాలలో గోల్డెన్ అవర్ ముఖ్యమైనది - ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు వివిధ నూతన పద్ధతులలో ప్రజలను మోసగిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ప్రజలు సైబర్ నేరాలతో మోసపోయిన వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 లేదా జాతీయ సైబర్ క్రైమ్ వెబ్సైట్లో ఫిర్యాదు చేయలన్నారు. ఆర్థిక నేరాలలో గోల్డెన్ అవర్ ముఖ్యమైనదని మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే నష్టపోయిన డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుత సమాజంలో ఏపీకే ఫైల్స్ ద్వారా మొబైల్ హ్యాకింగ్ పాల్పడుతూ, ఏఐ ఆధారిత వీడియో మెసేజ్‌ల ద్వారా మోసం చేస్తున్న తీరు ప్రబలిందని వాటిపట్ల అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్లు ఐపిఓ ద్వారా ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ చేస్తుంటారని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫీజులు చెల్లించాలంటూ మోసం చేస్తుంటారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అని స్టాక్ మార్కెట్‌లో థర్డ్ పార్టీ అప్లికేషన్‌ల ద్వారా ఇన్వెస్ట్మెంట్ చేసి మోసం చేస్తుంటారని. ఆన్లైన్ నందు నకిలీ కస్టమర్ కేర్ నెంబర్లను ఉంచి వాటి ద్వారా మోసం చేసే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. అత్యవసర సమయంలో ఎలాంటి పత్రాలు లేకుండా తక్కువ రుసుముతో ఎక్కువ డబ్బును లోన్ ద్వారా అందిస్తామంటూ నమ్మబలికి మోసం చేసే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. ఈవారం సైబర్ క్రైమ్ నందు 16 ఫిర్యాదులు అందాయని తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# కాంగ్రెస్ నాయకులపై డీసీపీకి బీజేపీ నేతల ఫిర్యాదు




**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మున్సిపాలిటీల ఫలితాలు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల అనంతరం బీజేపీ అభ్యర్థులను, కార్యకర్తలను బహిరంగంగా బెదిరింపులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాలుగా బహిరంగంగా కత్తులతో బీజేపీ అభ్యర్థులు, కార్యకర్తలను బెదిరిస్తూ, తల్వార్లు, కత్తులతో దాడులకు దిగే ప్రయత్నం చేశారన్నారు. బీజేపీ అభ్యర్థి డేగ బాపుతో పాటు కార్యకర్తలపై దాడులకు దిగే ప్రయత్నం చేశారని, హైటెక్ సిటీలో బీజేపీ అభ్యర్థి భర్త సురభి రవిని, ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు కిషోర్ రావు బహిరంగంగా బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. హమాలివాడలో 56వ డివిజన్ కార్పొరేటర్ నల్ల శంకర్ తన అనుచరులతో బిజెపి నాయకులు ఆకుల సంతోష్, సాతిని రాజులను బెదిరింపులగురి చేశారని, దొరగారి పల్లెలో బిజెపి అభ్యర్థిని, కార్యకర్తలను బెదిరించారన్నారు. ఇవి మచ్చుకు కొన్నేనని, ఈ డివిజన్‌లలోనే కాకుండా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో కాంగ్రెస్ నాయకులు గుండాల్లాగా బీజేపీ పార్టీ అభ్యర్థులను, కార్యకర్తలను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాలలో ఉన్న ప్రశాంతమైన వాతావరణ చెడగొట్టి గూండా, రౌడీ రాజ్యం చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి అడ్డుకట్ట వేసి, ఎవరైతే బహిరంగ దాడులకు, పాల్పడ్డవారిపై చర్యలు తీసుకొని ముందు ముందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకో వాలని డీసీపీకి విన్నవించినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



### లక్షెట్టిపేట మున్సిపాలిటీలో

# గెలిచింది కొత్త వారే

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

లక్షెట్టిపేట మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికలలో 15 వార్డులలో దాదాపు అందరు కొత్త వారే కౌన్సిలర్లుగా విజయం సాధించారు. 15 వార్డులకు 14 మంది కొత్త వారు కాగా ఒక్కరు (12వ వార్డు అభ్యర్థి పర్వీన్ సుల్తాన ఆరిఫ్ ) మాత్రమే పాతవారు. కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన 11 అభ్యర్థుల్లో 10 మంది కొత్త వారే కాగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు కొత్త వారే, బీజేపీ నుంచి మొదటి సారి గెలుపొందిన అభ్యర్థి సైతం నూతనంగా ప్రత్యక్ష ఎన్నికలలో పాల్గొన్న వ్యక్తి. కాంగ్రెస్ పార్టీ నుంచి పాత అభ్యర్థి ఒకరు కో-ఆప్షన్ సభ్యులుగా ఉన్నారు. మొత్తానికి లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 14 మంది కొత్త వారే విజయం సాధించిన 16న ప్రమాణ స్వీకారం చేసి మున్సిపాలిటీలో అడుగుపెట్టబోతున్నారు.

## కౌన్సిలర్లను అభినందించిన అల్లోల



**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులు విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు అభినందనలు వెలివెత్తుతున్నాయి. మున్సిపల్ చైర్మన్‌గా ప్రకటించిన అప్పలకావ్యను ఇంద్రకరణ్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించ ఆయన ఆశీర్వాదాన్ని చక్రవర్తి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

## 'కావేటి' కుటుంబానికి తగ్గని ఆదరణ

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో వార్డు 17ఓల్డ్ కాలనీ నుంచి కావేటి విజయ్ కౌన్సిలర్‌గా విజయం సాధించి రాజకీయాల్లోకి ప్రవేశించారు. తెలంగాణ ఉద్యమంలో గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య వారసత్వాన్ని కొనసాగిస్తూ, ప్రజల విశ్వాసం చూరగొన్నారు. అదే కుటుంబానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కావేటి సాయి లీల చేపట్టిన అభివృద్ధి పనులు ప్రాంతంలో ప్రభావం చూపాయి. ఓల్డ్ కాలనీ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదలే లక్ష్యమని విజయ్ తెలిపారు.



### కాకతీయుల కాలంనాటి

# శివకేశవాలయం

**వాంకిడి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండల కేంద్రంలోని చిక్లినది తీరాన కాకతీయుల కాలంలో నిర్మితమైన శివకేశవాలయం చరిత్రకు చిహ్నంగా నిలుస్తోంది. ఈ ఆలయం కాకతీయుల విజయాలకు ప్రతీకగా నిర్మించబడిందని స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఆలయంలో శివకేశవులతో పాటు రేణుక మాత విగ్రహాలు కొలువు దీరడం విశేషమని స్థానికులు పేర్కొన్నారు. ఒకే చోట శివుడు, కేశవుడు కొలువుదీరడం అరుదైన విషయమని వారు తెలిపారు. ఆలయ నిర్మాణ శైలి పరిశీలిస్తే ఆనాటి శిల్పకళా వైభవం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు.ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో, చిక్లినది తీరాన జాతరతో పాటు రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నితికా పంత్ తెలిపారు. వాంకిడి, రెబ్బెన, నంబాల, ఇస్గాం ప్రాంతాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశంతో ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, జనసందోహం నిర్వహణకు ఏర్పాట్లు చేసి, మహిళలు, వృద్ధులు, చిన్నారులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**తాండూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



మహిళలు వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు పద్మ విజయభాస్కర్ రెడ్డి, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. నిరుద్యోగ యువతులు, మహిళలకు సామాజిక భాధ్యత, స్వయం ఉపాధి కల్పనలో భాగంగా మాదారంలో శనివారం ఏర్పాటు చేసిన మగ్గం, స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే సాధించలేనిది ఏది ఉండదన్నారు. ప్రస్తుత సమాజానికి అను గుణంగా ప్రతి ఒక్కరు తమ కాళ్ల మీదా తాము నిలబడానికి వివిధ వొకేషనల్ ట్రైనింగ్ పొందుతున్నారని, సమాజంలో వివిధ ఫ్యాషన్‌తో కూడిన డిజైన్లు కొనుగోలు చేయడానికి ఖర్చుకు వెనుకాడటం లేదన్నారు. ఫ్యాషన్‌తో కూడిన కుట్లు, అల్లికలు, మగ్గంవర్క్, అందంగా అలంకరించడానికి బ్యూటీషియన్ లాంటి వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇటువంటి వాటిలో శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడడం లేదన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మోగిలి మాట్లాడుతూ మాదారంలో యోగా శిక్షణ తరగతులను కొనసాగించాలని కోరారు. అనంతరం మగ్గం, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులను సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ హెచ్‌వోడి శ్రీనివాస్, సింగరేణి సేవా సమితి సభ్యురాలు నళిని, మగ్గం, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షకులు శైలజ, చంద్రకళ, మహిళలు పాల్గొన్నారు.

# వాహనాలను అడ్డగించిన గ్రామస్థులు

## రోడ్డు నిర్మించాలని ఆందోళన

**కాసిపేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



కాసిపేట మండల కేంద్రంలోని తూర్పువాడలో గ్రామస్థులు వాహనాలను అడ్డుకొని రోడ్డు నిర్మించాలని నిరసన వ్యక్తం చేశారు. సింగరేణి వాహనాలు, దేవాపూర్ సిమెంట్ కంపెనీ, తదితర వాహనాలు మందమర్రిలో ఉన్న టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు గ్రామంలోకి భారీ వాహనాలు రావడం వల్ల రోడ్డు ధ్వంసం అయిందని మండి పడ్డారు. టోల్ ఖర్చులు తప్పించుకోవడానికి భారీ లోడుతో ఉన్న భారీ వాహనాలు ఈ దారి నుంచి వెళ్లడం ద్వారా కాసిపేట గ్రామ ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా చెడిపోయిందన్నారు. సింగరేణి సంస్థ ఓసీలో దొరికే మట్టి పోసి ఉన్న రోడ్డును కాస్త మరింత నాశనం చేశారని మండి పడ్డారు. ఆ మట్టి మొత్తం దుమ్ము లేచి ఇండ్లలోకి చేరి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు, సింగరేణి యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు.




# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**వాంకిడి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. మండల కేంద్రంలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక వక్త సుద్దిళ్ల రమేష్ ద్వారా మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఒక ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సబ్జెక్టు నిపుణులచే తయారు చేసి ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించాలన్నారు. సులభంగా ఏ విధంగా ఉత్తీర్ణులు కావడం, అత్యధిక మార్కులు ఏ విధంగా సాధించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణమూర్తి, సంక్షేమాధికారి మబంగాపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్ట పడి చదవాలి...**

విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్ట పడి చదవాలని ఎంఈవో సుభాష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉదయ్‌బాబు అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయకమైన తరగతులతో పాటు విషయ నిపుణులతో పాఠ్యాంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 13న ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలని చెప్పారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రణాళికతో సాగాలని సూచిం చారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయానికి గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రణాళికబద్ధంగా సాధన చేస్తే సులువుగా లక్ష్యం సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ప్రకాష్, మారుతి, సదాశివ్, రమేష్, లక్ష్మణ్, రాజేష్, విజేష్, హెచ్ఎం జనార్ధన్, శ్రీనివాస్, శ్రీధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




## సేవాలాల్ జయంతి
# వేడుకలను జయప్రదం చేయాలి

**లింగాపూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

17న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు చవాన్ గుణవంత్ రావు పిలుపునిచ్చారు. శనివారం లింగాపూర్ మండల పరిధిలోని గోపాలపూర్, రాముసాయక్ తాండ, కొత్తపల్లి, మామిడిపల్లి, ఖిమానాయక్ తాండ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి జయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# సమైక్య భవనాలకు భూమి పూజ

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మండలంలోని చేడ్వాయి గ్రామ పంచాయతీ, దరోగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతన గ్రామ సమైక్య (వీవో) భవనాల నిర్మాణానికి శనివారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చేడ్వాయి గ్రామ పంచాయతీలో వీవో భవనం, కొత్తగూడెంలో వీవో భవనాలు అలాగే వంట షెడ్ భవనాల నిర్మాణానికి మొత్తం రూ.22 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ చౌదరి శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దరోగపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో వీవో గ్రామ సమైక్య భవనానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో 12 మేకలు మృతి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

కుక్కల దాడిలో 12 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మంచిర్యాల జిల్లా లక్షెటిపేట మండలం హన్మంతుపల్లి గ్రామంలో జరిగింది. యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. వెల్పుల కొమురయ్య అనే రైతుకు చెందిన మేకల మందపై శుక్రవారం అర్ధరాత్రి కుక్కల గుంపు దాడి చేసింది. ఈ దాడిలో 12 మేకలు చనిపోగా.. మరో 3 మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.5లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



# సీఎం కప్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



జిల్లాస్థాయిలో నిర్వహించిన పీఎంశ్రీ పాఠశాలలు క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో జడ్పీహెచ్ఎస్ పెంచికల్పేట్ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో జడ్పీహెచ్ఎస్ పెంచికల్పేట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల పరుగుపందెంలో విద్యార్థి టి. సాయికుమార్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. ఇదే విభాగంలో డి. దివాకర్ తృతీయ స్థానం సాధించారు. అదేవిధంగా 600 మీటర్ల పరుగుపందెంలో సి.హెచ్. ఆకాష్ తృతీయ స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ఈ సందర్భంగా విజయాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా సర్వజన వికాస్ మంచ్ ప్రథమ వార్షికోత్సవం




**జైనూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో సర్వజన వికాస్ మంచ్ సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మశ్రీ కనక రాజు గుస్సాడి శిక్షణ కేంద్రం, మార్లవాయి గ్రామం ఈ సందర్భంగా సంస్థ సభ్యులు అడ్వకేట్ రాఘవేంద్ర (తమిళనాడు) మరియు శివమూర్తి (కర్ణాటక) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ అధ్యక్షత వహించారు. సభలో ప్రధానంగా చర్చించిన అంశాలు ఆదివాసీ హక్కుల పరిరక్షణ, గిరిజన భూముల రక్షణ, భూ ఆక్రమణల నివారణ, పేదలు, నిరుపేదలకు చట్టపరమైన అవగాహన విద్యా చైతన్యం పెంపొందించడం, సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నివారణ చట్టం-1989 ప్రకారం గిరిజనులు, దళితుల, మైనారిటీలు వెనుకబడిన జాతులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి వారికి న్యాయం అందించడమే తమ లక్ష్యమని వివరించారు. అలాగే పెసా చట్టం--1996 అమలుపై అవగాహన కల్పించడం, గ్రామ సభల అధికారాలను బలోపేతం చేయడం, గిరిజన ప్రాంతాల్లో స్వయం పాలనను కాపాడడం సంస్థ ప్రధాన కార్యక్రమాలుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమాలు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు సన్మానం హక్కులు మరియు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహణ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు విద్యా చైతన్య కార్యక్రమాలు ఆదివాసి సమాజానికి విద్యార్థులు, యువత, మహిళలు, సామాజిక కార్యకర్తల కోసం ప్రత్యేక సదస్సులు, సంస్థ ప్రతినిధులు భవిష్యత్తులో అవసరమైతే సుప్రీంకోర్టు వరకు కేసులు వాదించేందుకు స్వచ్ఛంద న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఒక వేదికగా నిలుస్తామని తెలిపారు. వారు ఆదివాసీ ప్రాంతాల్లో భూస్వాధీనాలు, కార్పొరేట్ కంపెనీల వల్ల జరుగుతున్న అన్యాయాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమం పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్స్ మరియు పెన్ పంపిణీ చేశారు. పాల్గొన్న ప్రముఖులు పుల్లర గ్రామపంచాయతీ సర్పంచ్ వెడ్మ జంగుబాయి, కోహినూర్(బి) సర్పంచ్ సిడం విజయలక్ష్మి, శెట్టి హడుపునూర్ సర్పంచ్ ఆత్రం విజయలక్ష్మి, పోచ్చాములోద్ది సర్పంచ్ మనోహర్, జెండాకూడా సర్పంచ్ ఉయిక చందన్ షా, కనక సుదర్శన్, కనక ఆనందరావు, సీడం రమేష్, హెడ్ మాస్టర్ అశోక్, ఆత్రం చౌక్క రావ్, వెంకటేశ్వర్ రావ్, భుజంగ్, కనక యదవ్ రావ్, గేడం మారుతి, ఆత్రం పద్మ రాజేశ్వర్, ఆత్రం భగవంత్ రావ్, సెడ్మకి భగవంత్ రావ్, రాజేశ్వర్, కనక రూప బాయి, పార్వతి, భరత్, పుల్ల బాయి, సర్జబాయి, గేడం శ్రీధర్, ఆడ సోనే రావ్, శ్రీనివాస్ జూగాది రావ్, విఠల్, మరు, జంగు, తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో
# భారీ శివలింగం ఏర్పాటు
## దర్శించుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని బ్రహ్మకుమారి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ శివలింగానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరికీ శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ ఐదు నిమిషాల పాటు ధ్యానం చేసి పరమాత్మ సేవలో తరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ ఆదిలాబాద్ ప్రతినిధిని రేవతి నందూరి, డాక్టర్ వజే, సామాజిక కార్యకర్త బండారి దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## భార్య మరణం
# తట్టుకోలేక భర్త మృతి

**దహెగాం, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. దీంతో ఆమె మరణం తట్టుకోలేక భర్త మృతిచెందిన సంఘటన దహెగాం మండలం కమ్మర్పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం వినోద్(32)కు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన సువర్ణ(29)తో 2020లో వివాహమైంది. కాగా సువర్ణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందగా కమ్మర్పల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో ఇంటికి తిరిగి రాగానే భర్త వినోద్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి, అక్కడి నుంచి బెల్లంపల్లికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్యభర్తల మరణంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోగా కమ్మర్పల్లిలో విషాద ఛాయలు నెలకొన్నాయి.





## నిందితులు కోర్టుకు హాజరు
# అయ్యేవిధంగా పర్యవేక్షించాలి



- శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలి
- రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్స్ కేసులపై సమీక్ష
- ప్రతి కేసుపై సీఐ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి
- కోర్టుకు హాజరు కానీ నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు వచ్చే విధంగా చూడాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు, సిఐలు, డీఎస్పీ స్థాయి అధికారులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ప్రతి ఒక్క కేసులో నిందితులు కోర్టుకు హాజరు అయ్యేవిధంగా సమన్లను జారీ చేయాలని సూచించారు. కోర్టు కేసులు పెండింగ్ లేకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్న రౌడీషీటర్స్, సస్పెక్ట్ షీటర్స్‌లపై నమోదైన కేసుల స్థితిగతులు కేసుల పరిస్థితిపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితులు తప్పించుకోవడానికి వీలు లేకుండా చూడాలన్నారు. కోర్టుకు హాజరు కాని వారిపై ఎన్‌బిడబ్ల్యూలను తీసుకొని తగిన చర్యలను తీసుకోవాలన్నారు. ప్రతీవారం సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ అధికారిచే సమావేశం ఏర్పాటు చేసి వారం రోజులలో జరిగిన కేసుల దర్యాప్తు పురోగతిపై పూర్తి క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌ల వారిగా జరుగుతున్న ప్రతి ఒక్క కేసుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోర్టుడ్యూటీ అధికారులకు నగదు రివార్డులను, ప్రశంసాపత్రాలను అందజేసి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కోర్టులో నేరస్తులకు శిక్ష పడుతున్న సందర్భంలో సమాజం సన్మార్గం వైపు ప్రయాణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కోర్టుల నందు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని సూచించారు. సమాజంలో నేరాల శాతంతో పాటు శిక్షల శాతం పెరుగుతూ ఉన్నప్పుడు నేరస్తులు నేరాలను చేయడానికి జంకుతారని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారం సక్రమంగా విధులు నిర్వహించినప్పుడు, నేరస్తులకు శిక్షలు పడి నేరాలు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఛార్జ్ షీట్ దాఖలు చేసే సమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా సమర్పించాలి. లోక్ అదాలత్ నందు రాజీ పడే కేసులను కోర్టు ద్వారా పరిష్కరించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో శ్రద్ధ వహించాలన్నారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, సీఐలు, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ అధికారులు, లైసెన్ అధికారులు పాల్గొన్నారు.

# పేద జంటల పెళ్లిళ్లకు అభిమన్యు గ్రూప్ అండ



**సిర్పూర్ (యు), ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యు) మండలం మహాగం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న సామూహిక వివాహాలకు అభిమన్యు గ్రూప్ చేయూతనిచ్చింది. ఈ నెల 16న సంత్ శ్రీసూరోజీ బాబా ఆశ్రమంలో 25 పేద కుటుంబాలకు చెందిన జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అభిమన్యు గ్రూప్ తరఫున నిధులు జమ చేయడంతో పాటు అన్నదానానికి అవసరమైన నిత్యావసర సరుకులను కమిటీ సభ్యులకు అందజేశారు. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు మాట్లాడుతూ... ఆశ్రమంలో ప్రతీ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుపేద కుటుంబాలకు తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. అభిమన్యు గ్రూప్ నిర్వాహకుడు మెస్రం శేఖర్ బాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద జంటలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మంచి కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాగం సర్పంచ్ జానే రావు, ఉపాధ్యాయులు లింగు, దత్తు, దేవ్ రావు, బండు, యువనేతలు మెస్రం అంబాజి రావు, సర్‌మెడి ఆనంద్ రావు, సీతారాం, కృష్ణమూర్తి, యాదవ్ రావు, మండల సర్పంచులు నగేష్, భూపతి, ఉయిక చందన్ షావ్ తదితరులు పాల్గొన్నారు.



## తప్పుడు పత్రాలు
# సృష్టించి ఓటు నమోదు
### మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపణ

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పలువురు నేతలు తప్పుడు పత్రాలను సృష్టించి తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో కోనప్ప మాట్లాడారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు లేనప్పటికీ తప్పుడు పత్రాలు సృష్టించి ఓటరు జాబితాలో తన పేరు చేర్పించుకుని ఎక్స్‌ఆఫిషియో సభ్యునిగా సమావేశంలో పాల్గొని ఓటు వేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 16న జరగనున్న మున్సిపల్ సమావేశంలో ఇటీవల గెలిచిన కౌన్సిలర్లతో పాటు ఛైర్మన్ ఎన్నిక జరగనుంది. ఈ సమావేశానికి ఎక్స్ ఆఫిషియో సభ్యులు కూడా హాజరవుతారు. ప్రభుత్వ ఆదేశాలు, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం... మున్సిపల్ పరిధిలో ఓటు హక్కు వినియోగించే ప్రజాప్రతినిధులకే ఎక్స్ ఆఫిషియో హోదా వర్తిస్తుంది. కానీ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో దండే విఠల్ పాల్గొనలేదని, ఓటు కూడా వేయలేదని, ఆ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఫైనల్ ఓటర్ లిస్ట్‌లో ఆయన పేరు లేదని కోనప్ప ఆరోపించారు. అదనంగా విడుదలైన చేర్పుల జాబితాలో కూడా పేరు లేదని పేర్కొన్నారు. గత 10-15 రోజులలో కొత్త ఓటరు నమోదు ప్రక్రియ కూడా జరగలేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఓటర్ లిస్ట్‌లో దండే విఠల్ పేరు ఉన్నట్లు చూపించడం అనుమానాస్పదమని, ఇది చట్టవిరుద్ధమని ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషనర్ పూర్తి స్థాయి విచారణ జరిపి, దండే విఠల్‌ను ఎక్స్‌ఆఫిషియో సభ్యునిగా కొనసాగించకూడదని డిమాండ్ చేశారు.

# బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రమాణికులకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి భాస్కర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలకు కలిగే అనర్థాల గురించి హక్కుల గురించి హెల్ప్ లైన్‌పై ప్రయాణ ప్రాంగణంలో ఉన్న ప్రయాణి కులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 100కు ఫోన్ చేసి తెలుపవచ్చని సూచించారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. బాల్య వివాహాలు చేయకూడదని చెప్పారు. బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం శిక్ష అర్హులు అవుతారని ఈ నాటక రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అంకూర్ వీడియో, రాజేష్ కన్నా కళాబృందం వారితో ప్రత్యేక కళాకారులతో



నాటక రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శారద, రాజేశ్వరి, సంతోష్, ప్రభు పాల్గొన్నారు.

## శివరాత్రిని పురస్కరించుకొని కర్ఝురి గ్రామంలో కబడ్డీ పోటీలు ప్రారంభం

**తలమడుగు, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఝురీ గ్రామ శ్రీరాజరాజేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించుకొని క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించి దాతల సహకారంతో బహుమతులను అందజేస్తున్నామన్నారు. ఉత్సాహవంతులైన క్రీడాకారులు పోటీలలో పాల్గొని బహుమతులు గేలుసుకోవచ్చని అన్నారు. రాజరాజేశ్వరీ కళ్యాణంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.













# భక్తుల కొంగు బంగారం.. బ్రహ్మేశ్వరాలయం

**కనకాపూర్ గ్రామ నది ఒడ్డున వెలిసిన ఆలయం**

**లోకేశ్వరం, బ్రహ్మేశ్వరం దేవాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు**









**లోకేశ్వరం, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

పిలిస్తే పలికే ప్రతిరూపంగా బ్రహ్మేశ్వర ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారం విరాజిల్లుతున్నది. శివనామస్మరణతో బ్రహ్మేశ్వరాన్ని పూజిస్తే కోరుకున్న కోరికలన్నీ నెరవేరుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. కొన్నేళ్ల క్రితం మండలంలోని గోదావరి ఒడ్డున వెలిసిన బ్రహ్మేశ్వర ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నది. బ్రహ్మేశ్వరాల యం నిత్య పూజలతో వెలుగొందుతున్నది. ఇక్కడికి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. శివరాత్రి రోజున గోదావరిలో స్నానమాచరిచి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

**ఆలయ ప్రాశస్త్యం..**

కాకతీయుల కాలంలో గణపతి దేవుడి పాలనలో ఏళ్ల కిందట బ్రహ్మేశ్వరాలయాన్ని రాతితో నిర్మించారు. ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే.. గోదావరి ఈ ఆలయ సమీపంలో ఉత్తరం దిక్కుగా ప్రవహిస్తూ ఉత్తర వాహినిగా పేరుగాంచింది. ఇక్కడి గోదావరిలో స్నానమాచరించి బ్రహ్మేశ్వరున్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని పెద్దలు చెబుతుంటారు. దీనికితోడు సూర్యోదయం వేళ కాంతి కిరణాలు గోదావరిలోని నీటిపై పడి నేరుగా ఆలయంలోని శివలింగంపై పడతాయి. అత్యంత ప్రాశస్తి గాంచినదిగా పేర్కొంటున్నారు. మండలంలోని కనకాపూర్ గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున ఆలయం నిర్మించడంతో వర్షాకాలంలో గోదావరి ప్రవాహానికి ఈ ఆలయం ముంపునకు గురవుతుంది. ఏళ్ల తరబడి నీటిలో ఉండేది. దీనికి తోడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మరింత ముంపు నీటిలోనే ఈ ఆలయం ఉండాల్సి వచ్చేది. కొన్నేళ్ల కిందట నేపాల్ నుంచి వచ్చిన సత్యానంద స్వామి రాకతో బ్రహ్మేశ్వరాలయం బయటి ప్రపంచానికి తెలిసింది. దక్షిణ భారతదేశంలో శివాలయం పరిరక్షణ కోసం నేపాల్ నుంచి కొందరు స్వాములు వచ్చారు. ఇందులో భాగంగా శ్రీ సత్యానంద స్వామి ఈ ప్రాంతానికి వచ్చి ముంపునకు గురవుతున్న బ్రహ్మేశ్వరాలయాన్ని పునరుద్ధరించారు. ఆలయాన్ని తెరిచి దూపదీప నైవేద్యాలను సమర్పిస్తుంటారు. దీంతో పాటు భక్తులు బ్రహ్మేశ్వరున్ని నమ్ముకొని కోరుకున్న కోరికలు ఫలిస్తుండడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది.

**మూడు రోజుల పాటు జాతర...**

ప్రతి శివరాత్రి మూడు రోజల పాటు జాతర నిర్వహించనున్నారు. మండల భక్తులే కాకుండా ముథోల్, భైంసా, కుంటాల, దిలావర్‌పూర్, నిర్మల్‌తో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటారు.

**శివరాత్రి జాతరకు ఏర్పాట్లు...**

మండలంలోని ఈసుగాంలో ఆదివారం నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఈసుగాం శివమల్లన్న ఆలయం ముస్తాబైంది. మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయానికి రంగులు వేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. సిర్పూరు నియోజకవర్గంలోనే అతి పెద్ద జాతర కావడంతో దాదాపు 2వేల మందికిపైగా భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. సహజసిద్ద భస్మరేఖలతో శివలింగం ఉండడం ఇక్కడి ప్రత్యేకత. సిర్పూరు, కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్ పట్టణం, మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు రానున్నారు. వాంకిడి మండల కేంద్రంలోని శివాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించి సుందరంగా తయారు చేశారు. ఆలయంలోని మూడు ముఖ ద్వారాలవైపు విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించే జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సాయత్రం ఐదు గంటలకు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించడానికి రథాలను ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఆసిఫాబాద్ ఆర్‌టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఆర్‌టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటణలు జరుగకుండా సీఐ సత్యనారా యణ, ఎస్సై మహెందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాదే ప్రవీణ్ తెలిపారు. రెబ్బెన మండలంలోని నంబాల గ్రామంలోని ప్రసన్న పరమేశ్వరాలయంలో ఆదివారం నిర్వహించే జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దెంకి సత్తయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుం టున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నారు. జాతరలో ఎడ్లబండ్ల ప్రత్యేక ఆకర్షిణీయంగా నిలుస్తాయి. ఆదివారం రథోత్సవం, కల్యాణం నిర్వహిస్తారు. ఆసిఫాబాద్ మండలంలోని ఆదివారం నిర్వహించే శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ శివాలయాలు అన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌లో గల శివాలయంతో పాటు చిర్రకుంట గ్రామంలోని శివమల్లన్న ఆలయం, బూర్గుడ గ్రామంలో ఉన్న శివాయలం, గుండెలోని శివాలయంతో పాటు మరికొన్ని చోట్ల శివ లింగాలు ఉన్న ప్రాంతాల్లో ఆయలాలను ముస్తాబు చేస్తున్నారు. ఆయా ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శివపార్వతుల కల్యాణం, రాత్రి నుంచి ఉదయం వరకు భజన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బెజ్జూరు మండల కేంద్రంలోని రంగనాయక, శివాలయం, హను మాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆది, సోమవారాల్లో నిర్వహించే జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్ తెలిపారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఈ ప్రాంతానికి తరలివచ్చి పూజలు చేస్తారు. దహెగాంలో శివకేశవాలయం, లగ్గాం ఉమాచంద్రశేఖర ఆలయం, కుంచవెల్లిలో రామలింగేశ్వర ఆలయం, అయినం శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**శివరాత్రికి నంబాల పరమేశ్వర క్షేత్రం...**

రెబ్బెన మండలం నంబాల గ్రామంలో ప్రసన్న పరమేశ్వరుని జాతర మహాశివరాత్రి వేడకులకు ముస్తాబైంది. ఈ సందర్భంగా జాతరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, బెల్లంపల్లి, తాండూర్, కాగజ్ నగర్, ప్రజలే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా అనేకమంది భక్తులు చేరుకుని పరమేశ్వరున్ని ప్రసన్నం చేసుకుంటారు. ఈ ఆలయంలో కొలువైన పరమేశ్వరుడిని భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా కొలుస్తారు. స్థానికుల కథనం ప్రకారం ఆలయ చరిత్రలో కెళితే సుమారు 67 సంవత్సరాల క్రితం తాండూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ శివ భక్తుడైన వృద్ధుడి నడుము వంగిపోయిందట. నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్దుడు నెమ్మదిగా నేలను తడుముకుంటూ కొత్తపెల్లి గ్రామం నుండి నంద్యాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెల్లేందుకు పయనం అయ్యాడట. ఆ భక్తుని బాధ చూడలేని నాగుపాము మార్గమధ్యంలో ఆ వృద్దుడికి అడ్డగించిందని చెబుతారు. దీంతో అతను కంగారుగా ముందుకు వెళుతున్న క్రమంలో పాము ఓ సాధు రూపంలో దర్శనం ఇచ్చి నేను నీ నడుమును బాగా చేస్తాను ఏమిస్తావని అడిగాడట. దీంతో ఆ వృద్ధుడు నేను నిరుపేదని నా వద్ద ఏమీ లేదని చెప్పగా కనీసం నా సేవ చేస్తావా అని ఆ సాధువు అడిగాడట. అందుకు ఆ వృద్ధుడు సరేననడంతో ఆ సాధువు మళ్ళీ నాగుపాములాగా మారి వృద్ధుడి నడుముకు చుట్టుకోగానే అతని నడుము నిటారుగా అయిపోయిందని స్థానిక భక్తులు చెబుతున్నారు. అనంతరం ఆ పాము తాను ఇక్కడే కొలువదీరుతానని, తన భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారమవుతానని వరం ఇచ్చి మాయం అయ్యిందని చెబుతారు. ఆనాటి నుండి నేటికీ ఆ ప్రాంతంలో ఒక పుట్టలో నాగుపాము అక్కడి భక్తులకు దర్శనం ఇస్తుందని, వారి కోరికలు తీరుస్తుందని భక్తులు చెబుతుంటారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరి కోరికలు తీరతాయని అక్కడి భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో పెద్ద ఎత్తున జారత జరిపిస్తారని చెబుతారు. ఈ జాతర సందర్భంగా దేవాలయ కమిటీ వారు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశారు. అలాగే టీజీఎస్ఆర్టీసీ వారు జాతర సందర్భంగా ఆసిఫాబాద్ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

**శివరాత్రికిమద్దిమాడ స్వయంభు ఆలయం ముస్తాబు..**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ మద్దిమాడ స్వయంభు రాజరాజేశ్వర దేవాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, దీపాలతో ముస్తాబు చేశారు. నలువైపులా స్వాగత తోరణాలు, భక్తులు స్వయంభు శివాలయం సన్నిధికి చేరుకునేందుకు వీలుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 15న శివరాత్రి సందర్భంగా పార్వతి పరమేశ్వర కల్యాణం, సోమవారం 16న రథయాత్ర, శోభ యాత్ర ఉంటుందని అర్చకులు అర్చకులు మారుతీశ్వర ఆచార్యులు, బ్రహ్మ శ్రీ బెజ్జంకి సాయి నాథ ఆచార్య తెలిపారు. ప్రత్యేక లడ్డూ ప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ యనగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భీంరావు తెలిపారు.

**శివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు...**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. శివభక్తులతో జిల్లాలోని ఆలయాలు కిటకిటలాడనున్న నేపథ్యంలో ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఈస్గాం శివ మల్లన్న ఆలయం, వాంకిడి పురాతన శివాలయం, రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని ప్రసన్న పరమేశ్వర శివాలయం, జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయం, చిర్రకుంట గ్రామంలోని చిర్రకుంట శివ మల్లన్న ఆలయం, బూర్గుడ గ్రామంలోని శివాలయం, కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు, ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్, పెంచికల్పేట్ మండలం చేడ్వాయి, బెజ్జూర్ మండలం పాపణపేట్, తలయి గ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి శోభతో ప్రత్యేకంగా అలంకరించబడుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు, మహా రుద్రాభిషేకం, లింగోద్భవ పూజలు, శివ-పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు భజనలు, హరహర మహాదేవ నామస్మరణ, జాగరణ కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయాల వద్ద విద్యుత్ దీపాల అలంకరణ, తాగునీరు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీలు తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని జరుపుకునేందుకు ఆధ్యాత్మిక నెలకొంది.




# భైంసా 'పుర' పీఠం దక్కేది ఎవరికో..?

- ముస్సిపల్ చైర్మన్ ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ
- ఇంటిపెంటెండ్ అభ్యర్థి కసరత్తు
- కీలకంగా మారనున్న ఎమ్మెల్యే ఓటు!
- ఎంపీ, ఎమ్మెల్సీల ఓటు ఎటువైపో
- ఎంఐఎం, బీజేపీలు సైతం ప్రయత్నాలు..

**ముథోల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా భైంసా మున్సిపల్ పీఠంపై సర్వత్రా ఉత్కంఠ మొదలైంది. పట్టణ వ్యాప్తంగా 26 వార్డులు ఉండగా, చైర్మన్ పీఠం కైవసం కోసం స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి రాక పోవడంతో ఇంటిపెండెంట్‌లు కీలకం కానున్నారని ప్రజల్లో గుసగుసలు మొదలయ్యాయి. అయితే ఇప్పటికే వరుసగా భైంసా మున్సిపల్ పీఠాన్ని ఏంఐఎం పార్టీ దక్కించుకోగా, అందుకు విరుద్ధంగా ఈసారి రాజకీయ సమీకరణాలు భిన్నంగా కనిపిస్తున్నాయంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మేరకు ఇండిపెండెంట్‌లు, బీజేపీ కలిసి ఎంఐఎంకు చెక్ పెడతారంటూ ప్రజల్లో చర్చ కొనసాగగా, ఇప్పటికే ఇండిపెండెంట్ అభ్యర్థులలో ఒకరు మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునే పనిలో పడ్డట్టు, ఆ దిశగా పావులు కదుపుతూ, పీఠం కైవసం సమీకరణాన్ని సాల్వ్ చేసే పనిలో పడ్డట్టు పుకార్లు చక్కర్లు కోడుతున్నాయి. మొత్తం 26 వార్డ్‌ల్లో ఇండిపెండెంట్ కౌన్సిలర్స్7, బీజేపీ కౌన్సిలర్స్6, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటు వినియోగించుకొని చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటరని ప్రజల్లో ముమ్మర ప్రచారం సాగుతోంది. ఇండిపెండెన్‌లకు చైర్మన్ పీఠం వరిస్తే, వైస్ చైర్మన్ బీజేపీకా..! లేక ఇండిపెండెలకా..! అంటూ ప్రజలలో సందేహాలు సైతం మొదలయ్యాయి. వరుసగా మున్సిపల్ పీఠాన్ని అధిష్టించిన ఎంఐఎంకి బిజెపి, ఇండిపెండెంట్స్ అభ్యర్థులు చెక్ పెడతారంటూ సాగుతున్న ప్రచారంలో ఈ సారి ఎమ్మెల్యే ఓటు కీలకం కానుంది. అయితే ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ ఎక్స్ అఫిషియో సభ్యుని ఓటు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో నమోదు అయినట్లు తెలిసింది. రెండు ఎమ్మెల్సీ ఎక్స్ ఆఫిషియో సభ్యుల ఓట్లనీ సైతం అవసరం మేరకు వినియోగించి బీజేపీ సైతం పీఠంపై గురి పెట్టిందని టాక్ నడువగా, మరో పక్క ఎంఐఎం సైతం పీఠం కైవసం కోసం పావులు కదుపుతున్నట్లు ప్రజల్లో విస్తృతంగా చర్చ కొనసాగుతుంది. ఎలాగైన భైంసా బల్దియాలో పాగా వేయాలని ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్యనేతలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ఇలా ఎవరి సమీకరణాలకు తగ్గట్టు వారు పీఠంపై ఆశలు పెంచుకోవడంతో పట్టణ ప్రజల్లో పుర పీఠం ఎవరు కైవసం చేసుకుంటారని సర్వత్రా ఉత్కంఠ మొదలయ్యింది. ఏది ఏమైనా ఈ సారి పట్టణ పుర పీటం ఎవరికి దక్కుతుందోనన్న విషయంలో రాజకీయ సమీకరణాలు ఏవిధంగా కొనసాగుతాయో ఈ నెల 16వ తేదీ వరకు వేచి చూడాల్సిందే..!

# గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**జన్నారం, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**




గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్ అన్నారు. శనివారం గల్ఫ్ కార్మికులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల వీసా సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయం, మరణించిన కార్మికుల పార్థివ దేహాలను స్వదేశానికి పంపించే ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అందించే ఇన్సూరెన్స్ డబ్బులు కాలయాపన వంటి అంశాలపై ప్రభుత్వాలు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. భారతీయ ఎంబసీ, ఒమాన్ పోలీస్ శాఖ సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ కార్మికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పాలాజీ శ్రీనివాస్ కోఆర్డినేటర్లకు ఒమాన్ లేబర్ శ్రీఖష వివిధ సమస్యల అవగాహన కల్పించి ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యను పరిష్కరించలేక నేను కృషి చేస్తారని వారు హామీ ఇచ్చారు. ఇచ్చిన బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వహిస్తూ, గల్ఫ్ కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేసిన మస్కట్ కోఆర్డినేటర్లు, సభ్యులు మరియు స్నేహితులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓమన్ శాఖ అధ్యక్షులు జవుడల సత్తన్న మస్కట్ శాఖ కోఆర్డినేటర్లు గోగు దేవరాజు, రాజు, శ్రీనివాస్ కో-ఆర్డినేటర్లు కార్మికులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల
# విద్యార్థుల క్షేత్ర పర్యటన

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా మహారాష్ట్రలోని విసాపూర్‌లో గల బొటానికల్ గార్డెన్ సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. కళాశాల వృక్ష, జంతు శాస్త్ర విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొని పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు ఆయా అంశాలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ పరికరాలపై ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి.దేవేందర్ రెడ్డి విద్యార్థులకు వివిధ ఔషధ, ఆర్థిక ప్రాముఖ్యత గల మొక్కల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బొటానికల్ గార్డెన్ లోని జీవ వైవిధ్యం గురించి జంతుశాస్త్ర అధ్యాపకులు బి.వెంకటేశం వివరించగా, మహారాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక నిర్మాణాలు, వారసత్వ సంపద గురించి తెలుగు, హిందీ విభాగాధిపతులు లక్ష్మినరసింహం, జనార్ధన్ విద్యార్థులకు తెలియజేశారు. క్షేత్ర పర్యటనలో అధ్యాపకులు శారద, వెంకటేశం, మల్లిఖార్జున్, నర్సింగరావు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో తల్లిదండ్రులకు పాదపూజ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**



ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫిబ్రవరి 14ను పురస్కరించుకుని అమ్మానాన్నల పాదపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జంబోజు తిరుపతాచార్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశ పూజలతో ప్రారంభించి, అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి పసుపు, కుంకుమ రాసి పూలదండలు వేసి నమస్కరించారు. తల్లిదండ్రులు పిల్లలకు అక్షింతలు వేసి ఆశీర్వదించగా, పిల్లలను దగ్గరకు తీసుకొని ప్రేమతో గుండెలకు హత్తుకున్నారు. ఈ సందర్భంగా పోషకులు డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ పిల్లలకు చక్కటి సంస్కారాలు అందిస్తున్న ఏకైక విద్యాసంస్థలు సరస్వతీ శిశు మందిరాలేనని పేర్కొన్నారు. పోషకులు కూడా తమ తల్లిదండ్రులను గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారాలను నేటి తరానికి అందిస్తున్న సరస్వతీ శిశు మందిర్ ఉపాధ్యాయులను అభినందించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షులు దేవ భూషణం మాట్లాడుతూ పిల్లలు భక్తిశ్రద్ధలతో పాదపూజ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమ వక్త దహెగాం గోవిందరావు మాట్లాడుతూ సరస్వతీ శిశు మందిరాల్లో చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను బోధిస్తున్నామని, పోషకుల కోరిక మేరకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆంగ్ల మాధ్యమంలో పాఠశాలలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల పెంపకమే పిల్లల భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి హనుమాండ్ల రాజన్న, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శులు నాగుల శ్రీనివాస్, మధుకర్, సభ్యులు విశాల్, సంతోష్ పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలి

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

బంజారాలు ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని జయప్రదం చేయాలని సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ భీంరావు పిలుపు నిచ్చారు. శని వారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయం ఆవరణలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్స వాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 18న ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జరగబోయే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.


# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

## బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని భూతాయి గ్రామానికి చెందిన పాడ్వాల్ ప్రహ్లాద్ నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహ గృహ ప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రజాక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్, మోర్కండి సర్పంచ్ తొడసం నాందేవ్, నాయకులు విఠల్, సూర్యవంశీ పండురంగ్, పాడ్వాల్ రాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం, సయ్యద్ సల్మాన్, యువజన మండల అధ్యక్షుడు కనిందే దినేష్, దేవేందర్, రమేష్, రమణ, సందీప్, బాల రవి, కుప్పే గణేష్, మారుతి, కిరప్ప విఠల్, దంగరి పండరి పాల్గొన్నారు.







# శ్రీవిష్ణు vs శ్రీవిష్ణు..

టాలీవుడ్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకోనుంది. ఒక్కరోజు తేడాతో ఒకే హీరోవి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. శ్రీ విష్ణు నటించిన రెండు చిత్రాలు ఈ నెలాఖరులో సందడి చేయనున్నాయి.శ్రీ విష్ణు హీరోగా శ్రీహుసేన్ షా కిరణ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మృత్యుంజయ్' ఫిబ్రవరి 27న విడుదల కానుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథతో రానున్న ఈ చిత్రంలో రెబా మోనికా జాన్ కథానాయికగా నటించారు. ఇటీవల టీజర్‌ను విడుదల చేయగా అది ఆకట్టుకుంది. నేడు మరో సినిమా 'విష్ణు విన్యాసం' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. యదునాథ్ మారుతి రావు దర్శకత్వంలో రూపొందిన ఈ కామెడీ డ్రామాని ఫిబ్రవరి 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఒక్కరోజు తేడాతోనే రెండు చిత్రాలు విడుదల కానున్నాయి.'విష్ణు విన్యాసం'లో విష్ణు సరసన నయన్ సారిక నటించారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'మొదలే మొదలే...' అంటూ సాగే గీతాన్ని పంచుకున్నారు. 'మృత్యుంజయ్' ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్.. 'విష్ణు విన్యాసం'ను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నాయి.






# 'ధురంధర్'లో విలన్ రోల్ మిస్సయ్యారా?

కథానాయకుడిగానే కాదు. ప్రత్యేక పాత్రల్లోనూ మెరుస్తున్నారు నాగార్జున ఇటీవల 'కూలీ'లో ప్రతినాయకుడు సిమన్ పాత్రలో నటించి మెప్పించారు. సినిమా ఫలితం ఎలా ఉన్నా, ఆయన పాత్ర, నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఈ నేపథ్యంలో నాగార్జున ఓ మంచి అవకాశాన్ని పోగొట్టుకున్నారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు హల్‌చల్ చేశాయి. తాజా బాలీవుడ్ సంచలనం 'ధురంధర్'. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ రూపొందించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇందులో రెహమాన్ డెకాయిత్ పాత్రలో అక్షయ్ ఖన్నా అదరగొట్టారు. ఈ పాత్ర కోసం చిత్ర బృందం నాగార్జునను సంప్రదించిందని వార్తలు వచ్చాయి. 'కూలీ' కారణంగానే 'ధురంధర్'లో రెహమాన్ పాత్రను వదులుకున్నారంటూ పలు వార్తలు రాసుకొచ్చారు. దీనిపై నాగార్జున స్పందించారు.అక్షయ్ ఖన్నా పాత్రను మీకు ఆఫర్ చేశారట నిజమేనా? అని ప్రశ్నించగా 'అలాంటిదేమీ లేదు. నాకు ఎవరూ ఏ పాత్ర చేయమని అడగలేదు. అయితే, 'ధురంధర్' సూపర్‌మూవీ. ఆదిత్యధర్ అద్భుతంగా దర్శకత్వం వహించారు. ఆయన తీసిన 'ఉరి' మూవీ కూడా ఇష్టమే. 'ధురంధర్'లో అందరూ చక్కగా నటించారు. అక్షయ్‌ఖన్నా నటన సినిమాకే హైలైట్. సీక్వెల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. అది కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని అన్నారు.



# రూమర్లకు చెక్ పెట్టిన మృణాల్

కొన్ని రోజులుగా వరుసగా రూమర్స్‌తో వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్ ధనుష్‌తో ఆమె ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. వీరిద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోనున్నారంటూ రూమర్స్ వచ్చాయి. వాటిని ఖండించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి మాట్లాడారు. వివాహం విషయంలో తొందరపడటం లేదన్నారు."పెళ్లి చేసుకుంటాను. కానీ.. దానికి సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడు వివాహబంధంలోకి అడుగుపెడతాను. అప్పుడు నేనే స్వయంగా చెబుతాను. నా సోషల్ మీడియా అకౌంట్స్‌లో నేనే పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని నేనే" అని చెప్పారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పెళ్లిపై అందరి ఆలోచనల్లో మార్పు వచ్చిందని మృణాల్ అన్నారు. ఇక ప్రేమికుల రోజు తన పెళ్లి జరగనుందంటూ వచ్చిన వార్తలపై ఆమె హాస్యాస్పదంగా స్పందించారు. నేడు ఫిబ్రవరి 14. మరికొన్ని రోజుల్లో ఏప్రిల్ 1 వస్తుంది.. ఆరోజు ఫూల్స్‌డే కదా.. అని సెటైర్ వేశారు.ఇక ఇటీవల ఆమె తన మాజీ బాయ్‌ఫ్రెండ్ గురించి చెప్పిన విషయం తెలిసిందే. తాను యాక్టింగ్ చేయడం అతడికి నచ్చలేదని అందుకే బ్రేకప్ చెప్పినట్లు వెల్లడించారు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమేనని అందుకే విడిపోయినట్లు చెప్పారు.



# శివ శివ శంభో..

**హరహర మహా దేవ శంభో శంకర**
**మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు**
**శివనామస్మరణతో మారుమోగనున్న శైవక్షేత్రాలు**
**భక్తుల కోసం ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**








**(ప్రభాత సమాచారం)** త్రిమూర్తులలో మొదటి వాడు బ్రహ్మ సృష్టికర్త.. రెండో వాడు విష్ణువు సంరక్షకుడు.. మూడోవాడు శివుడు. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు మహా శివరాత్రి కావడంతో శివుడికి ఇష్టమైన ఆ రోజున శివపూజ జరపడం మంచిదని శైవం చెబుతోంది. అందుకే అభిషేకాలు, బిల్వార్చనలను శివరాత్రినాడు విధిగా చేస్తుంటారు. శివరాత్రి నాడు పగలంతా ఉపవాసం, రాత్రిపూట లింగార్చన, జాగరణం చేస్తారు. లింగార్చన తరువాత పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం చేయడం కూడా ఆచారంగా వస్తోంది. తెలిసైనా, తెలియకైనా కొన్ని నీళ్ళు శివలింగం మీద పోసి మారేడు దళాలను అక్కడ పెడితే భోళాశంకరుడు అనుగ్రహించి కోరిన కోర్కెలు నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం.

### అయిదు రకాలు..

శివరాత్రులు అయిదు రకాలు. అవి.. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. నిత్యశివరాత్రి అంటే ప్రతిరోజూ రాత్రిపూట చేసే శివారాధన. పక్ష శివరాత్రి అంటే ప్రతి పదిహేను రోజులకొకసారి శివార్చన కోసం నిర్దేశించిన రాత్రి చేసే పూజా. మాసశివరాత్రి అంటే ప్రతి మాసంలోనూ శివపూజకు ఉద్దేశించిన రాత్రి. మిగతా శివరాత్రులు ఏవి కుదిరినా కుదరకపోయినా ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రినాడు శివపూజ చేయడం పుణ్యప్రదం. మహాశివరాత్రి మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్దశి తిథినాడు వస్తుంది. చతుర్దశి ఈతిథి శివుడికి ఎంతో ప్రీతికరమైంది. అందులోనూ కృష్ణచతుర్దశి అంటే అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి తిథి మరీ ప్రీతికరమైంది. ఆ కారణంగానే ప్రతి మాసంలోనూ వచ్చే కృష్ణచతుర్దశి తిథులు మాసశివరాత్రులుగా ఉంటాయి. సంవత్సరంలోని పన్నెండు శివరాత్రులలో మాఘమాసంలో వచ్చే శివరాత్రి శివుడికి బాగా ఇష్టమైంది కాబట్టి దాన్ని మహాశివరాత్రి అని అంటారు.

### నాలుగు రకాల అభిషేకాలు..

శివరాత్రినాటి లింగోద్భవ సమయంలో చేసే అభిషేకాలలో కూడా కొన్ని నియమాలున్నాయి. రాత్రి జాగరణం చేస్తూ నాలుగు జాములలోనూ నాలుగు సార్లు నాలుగు రకాలుగా అభిషేకాలు చేస్తుంటారు. మొదటి జాములో పాలతో అభిషేకించి, పద్మాలతో పూజచేసి పెసర పప్పు, బియ్యం కలిపి పులగం వండి శివుడికి నైవేద్యం పెడతారు. రుగ్వేద మంత్ర పఠనం జరుపుతారు. రెండో జాములో పెరుగుతో అభిషేకం, తులసీ దళార్చనచేసి, పాయసం నైవేద్యంపెట్టి యజుర్వేద మంత్రాలను చదువుతారు. మూడోజాములో నేతితో అభిషేకించి, మారేడు దళాలతో అర్చించి, నువ్వుల పొడి కలిపిన తీను బండారాలను నివేదిస్తారు. సామవేద మంత్రపఠన చేస్తారు. నాలుగో జాములో తేనెతో అభిషేకంచేసి నల్ల కలువలతో పూజించి అన్నం నివేదిస్తారు. అధర్వణ వేద మంత్రాలను పఠిస్తారు.

### శివదర్శనం చేసుకున్నా పుణ్యమే..

అభిషేకాలు చేసే శక్తిలేనివారు అభిషేకం చేసేటప్పుడు శివదర్శనం చేసుకున్నా పుణ్యమే నంటారు. నాలుగో జాము ముగిశాక ఉదయంపూట శివుడిని ఊరేగిస్తారు. ఇలా ఊరేగించడం వెనుక ఓ సామాజిక అంతరార్థం ఉంది. అందుకే భక్తులు శివరాత్రి రోజు అభిషేకం చేసి జాగారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. శివుడు మిగతా దేవతలతో పోలిస్తే సులువగా అనుగ్రహం ఇస్తాడని నమ్మిక. శివనామంతో సర్వపాపాలు హరించుకుని పోతాయని అంటారు. అందుకే మనదేశంలో అనేక శైవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. శివుడు లయకారకుడు. శివారాధకులకు మహాశిరాత్రి పర్వదినం. ఉపవాసం ఈ పండగ ప్రత్యేకత. శివుడు భోళా శంకరుడు కావడంతో అడగకుండానే వరాలిచ్చే దేవుడిగా ప్రతీతి. శివరాత్రి రోజు ఉపవాసంతో... రాత్రి అభిషేకించి జాగారం చేస్తే ముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే శివరాత్రి జాగారాలకు ప్రాధాన్యం ఉంది.

### లింగోద్భవ కాలం..

ఈశాన సంహిత ప్రకారం శివుడు అర్ధరాత్రి సమయంలో తేజోలింగంగా ఆవిర్భవించాడు. అదే లింగోద్భవ కాలం. కాశితో పాటు జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు. వినాయక చవితి, శ్రీరామ నవమి లాంటి పండుగలలో దేవుళ్లను పగటిపూట పూజిస్తారు. శివరాత్రినాడు శివుడిని రాత్రిపూట మాత్రమే పూజించడం, మిగిలిన పండుగలలా పంచభక్ష్య పరమాన్నాలతో కాక ఉపవాస దీక్షతో శివరాత్రి పండుగను జరుపుకోవడం ఓ విశేషం. యోగి అయినవాడు తన యోగబలం చేత యోగనిద్రలోకి వెళ్లే రాత్రిని యోగ శివరాత్రి అని అంటారు. సాధారణంగా రాత్రిపూట దేవీపూజను, పగటిపూట దేవపూజను చేయడం ఒక ఆచారంగా ఉంటుంది. కానీ శివరాత్రి విషయంలో మాత్రం ఇది భిన్నంగా కనిపిస్తుంది. శివరాత్రి రోజున రాత్రిపూటే శివపూజ జరుగుతుంది. ఇలా శివ ఆరాధన రాత్రిపూట జరగడానికి ఓ కారణం కూడా ఉంది. పూర్వం ఓసారి ప్రళయం వచ్చినప్పుడు అంతా కటికచీకటిగా మారిపోయింది. ఆ సమయంలో లోక కల్యాణం కోసం పార్వతీదేవి శివుడిని గురించి తపస్సు చేసింది. ఆనాటి పార్వతి తపస్సు మెచ్చిన శివుడు ఆ చీకటిని పోగొట్టి మళ్లీ మామూలుగా రాత్రి, పగలు ఏర్పడేలా చేశాడు. దాంతో జీవులన్నీ మళ్లీ ఆనందించాయి. తాను చేసినట్లుగా అంత రాత్రివేళ శివుడిని గురించి పూజలు చేసినవారికి సర్వసుఖాలు కలిగేలా అనుగ్రహించమని పార్వతీదేవి శివుడిని ప్రార్థించింది. శివుడు అందుకు అంగీకరించాడు. పార్వతి చేసిన శివపూజకు గుర్తుగా ఆనాటి నుంచి మహాశివరాత్రి పూజా పర్వదినం ఏర్పడింది.

## శివరాత్రికి ముస్తాబైన

# పశుపతినాథ్ ఆలయం

**భక్తుల కోరిన కోరికలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న క్షేత్రం**





**ముథోల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)** నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని అతిపురాతనమైన పశుపతినాథ్ శివాలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. మొక్కిన మొక్కులు తీర్చే ఇలవేల్పుగా విరజిల్లుతుంది. 2007 ఏప్రిల్ మాసంలో 2వ తేదీన తవ్వకాల్లో భారీ శివలింగాలు బయటపడ్డాయి, కాకతీయ కాలం నాటి ఆలయం తవ్వకాల్లో బయటపడిందని ఆలయ మహిమానిత్వం కలదని వయోవృద్దులు తెలుపుతున్నారు.
ఈ ఆలయంలో ప్రతీ సంవత్సరం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు జాతర జరుగుతుంది. గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ జాతర అంగరంగ వైభవంగా జరుపుతారు. ఈ జాతరకు తెలంగాణ ప్రాంతం నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివస్తారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా భక్తులకు నమ్మకం. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

**నేటి నుంచి జాతర ప్రారంభం...**

ముందు అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తారు. జాతర ముగింపు రోజు ఈ సప్తాహముగుస్తుంది. ఏడు రోజులు భజన సంకీర్తనలు చేస్తారు. బాసర వచ్చిన భక్తులు ఆలయాన్ని దర్శించుకునేందుకు ముథోల్‌కు వస్తుంటారు.

**జాతరకు ఏర్పాట్లు పూర్తి...**

మహా శివరాత్రి సందర్భంగా శివాలయంలో జాతర జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని చేస్తున్నారు. పంచగవ్య ప్రోక్షణ, లఘున్యాస, పూర్వక ఏకాదశిని, లింగోద్భవ పూజ రుద్రాభిషేకం, అభిషేకం, పూజ, లఘున్యాస రుద్రాభిషేకం, అన్న పూజ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే మహా శివరాత్రికి మండలంలోని ఎడ్‌బిడ్, చించాల, రాంటెక్, తరోడా, వెంకటాపూర్, విట్టోలి, గ్రామాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి.



### ద్వాదశ జ్యోతిర్లింగాలు

- 1) సోమనాథేశ్వరుడు- గుజరాత్‌లోని సోమనాథ్‌లో ఉంది
- 2) శ్రీ మల్లికార్జునుడు- ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా శ్రీశైలంలో వుంది.
- 3) మహాకాళేశ్వరుడు- మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయినిలో వుంది.
- 4) ఓంకారేశ్వరుడు- మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌కు 80కిలోమీటర్ల దూరంలో వుంది.
- 5) కేదాశ్వరుడు- ఉత్తర ప్రదేశ్‌లోని హిమాలయ పర్వత పంక్తిలో భాగమైన కేదారపర్వతంపై కేదారేశ్వరుడు నెలవై వున్నాడు.
- 6) భీమ శంకరుడు- మహారాష్ట్రలోని పూనాకు 75 మైళ్ల దూరంలో సహ్యాద్రి పర్వత పంక్తుల్లో వెలసిన దివ్య క్షేత్రమిది.
- 7) విశ్వేశ్వరుడు- ఉత్తర ప్రదేశ్‌లోని కాశీ క్షేత్ర జ్యోతిర్లింగంజ.
- 8) త్ర్యంబంకేశ్వరుడు- మహారాష్ట్ర నాసిక్ జిల్లాలోని త్ర్యంబకేశ్వరం పవిత్ర గోదావరి నది జన్మస్థలి.
- 9) వైద్యనాథేశ్వరుడు- మహారాష్ట్రలోని భిర్‌జిల్లా పర్లీలో వెలిసిన జ్యోతిర్లింగం.
- 10) నాగేశ్వరుడు- మహారాష్ట్రలోని భిర్‌జిల్లా పర్లీలో వెలిసిన జ్యోతిర్లింగం.
- 11) రామేశ్వరుడు- తమిళనాడులోని రామేశ్వరంలో వెలిసిన జ్యోతిర్లింగం.
- 12) ఘృశ్శేశ్వరుడు- మహారాష్ట్రలోని దౌలతాబాద్‌లో 20కి.మీ దూరంలో వుంది.

# మేయర్ పదవి వరించేదెవరినో..!

- మంచిర్యాల కార్పొరేషన్‌లో టెన్షన్
- ఇప్పటికీ ఖరారుకాని పేర్లు
- మునిసిపాలిటీల్లోనూ పూర్తికాని ఎంపిక
- రేపు మునిసిపల్ మేయర్/చైర్మన్‌ల ఎన్నిక

**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మునిసిపల్ ఎన్నికలు ముగిసి, ఫలితాలు కూడా వెల్లడికాగా, ఇక మేయర్/చైర్మన్ పదవుల భర్తీ చేపట్టవలసి ఉంది. శివ రాత్రి పర్వదినం సందర్భంగా సెలవుదినడం కావడంతో ఆ ప్రక్రియను ఎన్నికల కమిషన్ సోమవారం చేప ట్టనుంది. జిల్లాలో ఎన్నికలు జరిగిన మంచిర్యాల కార్పొ రేషన్‌తోపాటు బెల్లంపల్లి, చెన్నూరు, క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేట మునిసిపాలిటీలకు మేయర్/చైర్మన్‌ల ఎన్నిక ఈ నెల 16న చేపట్టనుండగా, ఎవరు ఆ పదవులను అలంకరిస్తారోనన్న టెన్షన్ విజేతలతో పాటు ప్రజల్లోనూ ఉంది. మంచిర్యాల కార్పొరేషన్‌తోపాటు చెన్నూరు, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, క్యాతన్‌పల్లి మునిసిపాలిటీల్లో కలెక్టర్ సమక్షంలో సోమవారం మధ్యాహ్నం చైర్మన్లు, మేయర్ పదవులకు ఎన్నిక జరుగనుంది. ఈ మేరకు ఆయా మునిసిపాలిటీల్లోనే అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత మేయర్/చైర్మన్‌లను ఎన్నుకున్న తరువాత డి ప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎంపిక ఉండనుంది. పై పదవుల ఎంపిక పూర్తికాగానే వారితోపాటు కార్పొరేట ర్లు/కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టనున్నారు.

**చేతులెత్తడం ద్వారా ఎంపిక....**

మేయర్/చైర్మన్ల ఎంపిక ప్రక్రియ ఎన్నికల్లో గెలుపొం దిన వారు చేతులెత్తడం ద్వారా చేపట్టనున్నారు. మంచి ర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీకి 44సీట్లు వచ్చినందున మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు ఆ పార్టీకే దక్కనున్నాయి. చెన్నూరు, లక్షెట్టిపేట మునిసిపాలిటీల ను సైతం కాంగ్రెస్




పార్టీ కైవసం చేసుకున్నందున ఆ పార్టీ కౌన్సిలర్ల నుంచే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్ను కోనున్నారు. క్యాతన్‌పల్లి ము నిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన వారు చైర్మన్ పదవిని అలంకరించే అవకాశాలు ఉన్నాయి. క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్‌తో సీపీఐ పొత్తు పెట్టుకున్నందున సీపీఐకి చెందిన కౌన్సిలర్ ఒకరికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయి. ఇక బెల్లంపల్లి మునిసిపాలిటీలో రాజకీయ సమీకరణాలు ఎప్పటిక ప్పు డు మారుతున్నందున అక్కడ చైర్మన్, వైస్ చైర్మన్ పద వులు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య దోబూచులాడు తున్నా యి. బెల్లంపల్లిలో 34 వార్డులకు గాను కాంగ్రెస్, బీఆర్ ఎస్ చెరో 14 వార్డులు గెలుచుకోగా, బీజేపీ 1, స్వతంత్రు లు 5 సీట్లలో గెలుపొందారు. రెండు పార్టీలకు సమా నంగా సీట్లు దక్కడంతో బలనిరూపణ చేసే పార్టీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దక్కనున్నాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల విష యంలో కౌన్సిలర్ల మధ్య ఇప్పటికే గ్రూపులు ఏర్పడ్డాయి. ఈ వివాదం కౌన్సిలర్లు పార్టీ మారేదాక వచ్చింది. ప్ర స్తుత పరిస్థితుల్లో బెల్లంపల్లిలో బీఆర్ఎస్ జెండా ఎగిరే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయి.

**తెరపైకి పలువురి పేర్లు...**

మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి మేయర్, డి ప్యూటీ మేయర్ పదవులు ఆశించే కాంగ్రెస్ కార్పొరేటర్ల పేర్లు కొన్ని తెరపైకి వచ్చాయి. మేయర్ పదవి బీసీ జ నరల్ విభాగానికి రిజర్వ్ అయినందున ఆ పదవిని ఆశిస్తున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిలో 14వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన తూముల నరేష్, 32వ డివిజన్ కార్పొరేటర్ ధరణి మధూకర్, 46వ డివిజన్ కార్పొరేటర్ పెంట రజిత, వ 54వ డివిజన్ కార్పొరేటర్ సల్ల రమ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పై వారిలో ఎవరో ఒకరిని మేయర్ పదవి వరించనుండగా, మరొకరు డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కానున్నారు. లక్షెట్టిపేట మునిసిపాలిటీ ఎస్సీ జనరల్‌కు రిజర్వ్‌కాగా 2వ వార్డు అభ్యర్థి దొంత అంజలికి చైర్మన్ పదవి లభించే అవకాశాలు ఉన్నాయి. క్యాతన్‌పల్లి మునిసిపాలిటీ చైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్‌కాగా 17వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణికి ఇచ్చే అవ కాశాలు అధికంగా ఉన్నాయి. బెల్లంపల్లి మునిసిపల్ చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్‌కాగా, వర్గానికి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ చిప్ప అర్చన, 7వ వార్డు కౌన్సిలర్ దావా స్వాతి ఆశిస్తున్నారు. చెన్నూరు మునిపల్ చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్‌కాగా ఆ వర్గానికి 2వ వా ర్డు కౌన్సిలర్ పెద్దింటి పద్మ, 8వ వార్డు కౌన్సిలర్ సుంకరి శిరీష, 9వ వార్డు కౌన్సిలర్ సుద్దపల్లి సునీత, 12వ కౌన్సి లర్ ఎండీ నజ్మా, 15వ వార్డు కౌన్సిలర్ కొమ్మెర జయలక్ష్మి ఆశిస్తున్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ స్వతంత్ర కౌన్సిలర్లు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మున్సిపల్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఎప్పుడేమి జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ క్యాంపు నుంచి 26 వార్డు కౌన్సిలర్ ఇప్ప కుమార్ స్వామి బయటికి వచ్చినట్లు తెలుస్తోంది. 30వ వార్డు నుంచి గెలుపొంది

**కాంగ్రెస్‌కు బిగ్ షాక్ - కాంగ్రెస్ క్యాంపులో కలకలం**

న సుకేశిని భరద్వాజ్ తండ్రి మాజీ కౌన్సిలర్ బిజి శంకర్ సింగ్, 34 వార్డు బిజెపి నుంచి గెలిచిన కొక్కుల రామ్మూర్తి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువా కప్పి కేటీఆర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. దీంతో కాంగ్రెస్ క్యాంపులో కలవరం మొదలైంది. 28 వార్డు నుంచి గెలుపొందిన చిప్ప అర్చన చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. అదేవిధంగా 7వ వార్డు నుంచి దావస్వాతి కూడా చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. చైర్మన్ గిరిపై కాంగ్రెస్‌లో పోటీ పెరగడంతో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కాంగ్రెస్ నాయకుడు చిప్ప మనోహర్ కనుసన్నలోనే ఈ సమీకరణలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. చైర్మన్ రేసులో ఉన్న అభ్యర్థుల మధ్య విభేదాలు కాంగ్రెస్ క్యాంపులో లుకలుకలు బయలుదేరాయి. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనూహ్యమైన సమీకరణలు కాంగ్రెస్ క్యాంపులో గుబులు రేపుతున్నాయి. అసమ్మతి వాదులు బీఆర్ఎస్ గూటికి ఎంత మంది వెళ్తారో చెప్పలేని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాగ్రెస్ క్యాంపు వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఎవరు ఏ క్యాంపు నుంచి ఉంటారో బయటికి వస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. చైర్మన్‌గిరి కోసం శరవేగంగా సమీకరణలు మారుతున్నాయి.



# మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## బోథ్ నియోజకవర్గ ఇంచార్జీ ఆడే గజేందర్

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులకు మెరుగైన విద్యా, వాతావరణం అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జవహర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కాండ్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీగోడ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రతి పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెల్కే పాండురంగ్, మోర్కండి సర్పంచ్ తొడసం నాందేవ్, కండ్లీ సర్పంచ్ అనిత రాంకిషన్ నాయక్, కళ్ళెం విఠల్, సూర్యవంశీ పండురంగ్, పాడ్వాల్ రాజు, జంగుబాపు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం, సయ్యద్ సల్మాన్, యువజన మండల అధ్యక్షుడు కనిందే దినేష్, గవ్వల దేవేందర్, గొల్ల నాగు రమేష్, కీర్తి రమణ, తాండ్ర రమణ, సందీప్, బాల రవి, కుప్సే గణేష్, మారుతి, కిరప్ప విఠల్, దంగరి పండరి, తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం

**కుభీర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారిణి సారిక రావు హెచ్చరించారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని శ్రీరామ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణాన్ని శనివారం ఆమె సందర్శించారు. నాలుగు రోజుల క్రితమే ఈ దుకాణ లైసెన్స్ రద్దుకు జిల్లా ఉన్నతాధికారులకు సిఫారసు చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ దుకాణాన్ని తెరిచి ఉంచుతూ రూ. 266 రూపాయల యూరియా బస్తా రూ.360 నుండి రూ. 370 వరకు విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంపై ఆమె మండిపడ్డారు. తాము ఎరువులను విక్రయించడం లేదని, రైతులు బుక్ చేసుకున్న యూరియా బస్తాలను ఇవ్వడం కోసమే దుకాణం తెరిచి ఉంచినట్లు డీలర్ తెలిపారు. ఈ సందర్భంగా వెంటనే దుకాణాన్ని వ్యవసాయ అధికారిని సారిక రావు మూసి వేయించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని రెండు ఫర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా



పలువురు రైతులు ఏవో సారిక రావుతో మాట్లాడుతూ ఫర్టిలైజర్ యాప్ వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. కొద్దిరోజుల్లో సమస్య తీరిపోతుందని అధిక ధరలకు యూరియాను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.

# ఆంగ్ల పుస్తకం ఆవిష్కరణ

**నిర్మల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

డిగ్రీ సెకండ్ సెమిస్టర్ విద్యార్థులకు ఉపయోగపడే ఇంగ్లీష్ పుస్తకాన్ని వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్ రచించారు. ఈ పుస్తకాన్ని శనివారం కళాశాలలో వశిష్ట కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ సెకండ్ సెమిస్టర్ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టుపై మంచి పరిజ్ఞానాన్ని, సరళమైన భాషలో అందించడంలో విశేషంగా కృషిచేసిన రచయిత అఖిలేష్ కుమార్ సింగ్‌ను అభినందించారు.

# కంపెనీ ఆస్తులను కాపాడిన గార్డులు

**మందమర్రి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**

మందమర్రి కేకే ఓసీ గనిలో శుక్రవారం అర్ధరాత్రి స్క్రాప్ దొంగతనానికి యత్నించిన వారిని, దొంగిలించిన వస్తువులను పట్టుకున్న పెద్దపల్లి సదానందం సీనియర్ సెక్యూరిటీ గార్డ్, ఎస్ అండ్ పీసీ మొబైల్ టాస్క్ ఫోర్స్ సభ్యులను ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ కంపెనీ ఆస్తులను కాపాడడంలో ప్రతి ఒక్కరు నిబద్ధతగా పనిచేసి సదానందంను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.



# శివాభిషేకము

## శివ పంచాక్షరి స్తోత్రమ్



- నాగేంద్రహారాయ త్రిలోచనాయ
భస్మాంగరాగాయ మహేశ్వరాయ
నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ
తస్మై "న" కారాయ నమః శివాయ
- మందాకినీ సలిల చందన చర్చితాయ
నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ
మందార ముఖ్య బహుపుష్ప
సుపూజితాయ
తస్మై "మ" కారాయ నమః శివాయ
- శివాయ గౌరీ వదనాబ్జ బృంద
సూర్యాయ దక్షాధ్వర నాశకాయ
శ్రీ నీలకంఠాయ వృషభధ్వజాయ
తస్మై "శి" కారాయ నమః శివాయ
- వశిష్ఠ కుంభోద్భవ గౌతమార్య
మునీంద్ర దేవార్చిత శేఖరాయ
చంద్రార్క వైశ్వానర లోచనాయ
తస్మై "వ" కారాయ నమః శివాయ
- యజ్ఞ స్వరూపాయ జటాధరాయ
పినాక హస్తాయ సనాతనాయ
దివ్యాయ దేవాయ దిగంబరాయ
తస్మై "య" కారాయ నమః శివాయ
- పంచాక్షరమిదం పుణ్యం యః పఠేచ్ఛివ
సన్నిధౌ శివలోకమవాప్నోతి శివేన
సహ మోదతే

## బిల్వాష్టకమ్

- త్రిదళం త్రిగుణాకారం
త్రినేత్రం చ త్రియాయుధం
- త్రిజన్మ పాపసంహారం
ఏకబిల్వం శివార్పితం
- త్రిశాఖైః బిల్వపత్రైశ్చ
అచ్ఛిద్రైః కోమలైః శుభైః
- తవపూజాం కరిష్యామి
ఏకబిల్వం శివార్పితం
- దర్శనం బిల్వవృక్షస్య
స్పర్శనం పాపనాశనం
- అఘోరపాపసంహారం
ఏకబిల్వం శివార్పితం
- సాలగ్రామేషు విప్రేషు
తటాకే వనకూపయోః
- యజ్ఞకోటి సహస్రాణాం
ఏకబిల్వం శివార్పితం
- దంతికోటి సహస్రేషు
అశ్వమేధ శతాని చ
- కోటికన్యాప్రదానేన
ఏకబిల్వం శివార్పితం
- ఏకం చ బిల్వపత్రైశ్చ
కోటియజ్ఞ ఫలం లభేత్
- మహాదేవైశ్చ పూజార్థం
ఏకబిల్వం శివార్పితం
- కాశీక్షేత్రే నివాసం చ
కాలభైరవ దర్శనం
- గయాప్రయాగ మే దృష్ట్వా
ఏకబిల్వం శివార్పితం
- ఉమయా సహ దేవేశం
వాహనం నందిశంకరం
- ముచ్యతే సర్వపాపేభ్యో
ఏకబిల్వం శివార్పితం

## లింగాష్టకం

1 బ్రహ్మ మురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

- బ్రహ్మ, విష్ణు, దేవతల చేత పూజింపబడ్డ లింగం. నిర్మలమైన మాటల చేత అలంకరింపబడ్డ లింగం. జన్మ వల్ల పుట్టిన బాధలను నాశనం చేసే లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

2 దేవముని ప్రవరార్చిత లింగం
కామదహన కరుణాకర లింగం
రావణ దర్ప వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

- దేవమునులు, మహా ఋషులు పూజించే లింగం మన్మధుడిని దహనం చేసిన, అపారమైన కరుణను చూపే చేతులు గల శివలింగం, రావణుడి గర్వాన్ని నాశనం చేసినట్టి శివ లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

3 కనక మహామణి భూషిత లింగం
ఫణిపతి వేష్టిత షోభిత లింగం
దక్ష సుయజ్ఞ నినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

- బంగారు, మహా మణుల చేత అలంకరింప బడ్డ శివ లింగం, నాగరాజు నివాసం చేత అలంకరింపబడ్డ శివ లింగం, దక్షుడు చేసిన మంచి యజ్ఞాన్ని నాశనం చేసిన శివ లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

4 కుంకుమ చందన
లేపిత లింగం
పంకజ హార
సుశోభిత లింగం
సంచిత పాప
వినాశక లింగం
తత్ప్రణమామి
సదాశివ లింగం

- కుంకుమ, గంధము పూయబడ్డ శివ లింగం, కలువల దండ చేత చక్కగా అలంకరింప బడ్డ శివ లింగం, సంక్రమించిన పాపాలని నాశనం చేసే శివ లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

5 దేవగణార్చిత
సేవిత లింగం
భావైర్భక్తిభి రేవచ
లింగం
దినకర కోటి
ప్రభాకర లింగం
తత్ప్రణమామి
సదాశివ లింగం

- దేవ గణాల చేత పూజింప బడ్డ, సేవించ బడ్డ శివ లింగం, చక్కటి భావం తో కూడిన భక్తీ చేత పూజింపబడ్డ శివ లింగం, కోటి సూర్యుల కాంతితో వెలిగే మరో సూర్య బింబం లాంటి శివ లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

6 అష్టదళోపరివేష్టిత లింగం
సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

- ఎనిమిది రకాల ఆకుల మీద నివాసముండే శివ లింగం, అన్నీ సమానంగా జన్మించడానికి కారణమైన శివ లింగం, ఎనిమిది రకాల దరిద్రాలను (అష్ట దరిద్రాలు) నాశనం చేసే శివ లింగం. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

7 సురగురు సురవర పూజిత లింగం
సురవన పుష్ప సదార్చిత లింగం
పరమపదం పరమాత్మక లింగం
తత్ప్రణమామి సదాశివ లింగం

- దేవ గురువు (బృహస్పతి), దేవతల చేత పూజింప బడ్డ శివ లింగం, దేవతల తోటల్లో పూచే పువ్వులు (పారిజాతాలు) చేత ఎప్పుడూ పూజింప బడే శివ లింగం, ఓ శివ లింగమా, నీ సన్నిధి ఏ ఒక స్వర్గము. ఓ సదా శివ లింగమా నీకు నమస్కారం

8 లింగాష్టకమిదం పుణ్యం యః
పఠేచ్ఛివ సన్నిధౌ శివలోక
మవాప్నోతి శివేన సహమోదతే!

- ఎప్పుడైతే శివుడి సన్నిధిలో చదవబడుతుందో వారికి చాలా పుణ్యం వస్తుంది, శివ లోకమైన కైలాస ప్రాప్తి లభిస్తుంది. శివుడి లో ఐక్యమయ్యే మార్గం దొరుకుతుంది.


**ఖర్జూర అభిషేకము**
శత్రుహానిని హరింప జేస్తుంది


**పెరుగుతో అభిషేకము**
బలము, ఆరోగ్యము, యశస్సు


**నువ్వుల నూనెతో అభిషేకము**
అపమృత్యువు నశించును


**భస్మాభిషేకం**
మహా పాపాలు నశించును


**ఆవు నెయ్యి అభిషేకం**
ఐశ్వర్యప్రాప్తి కలుగును



**మారేడు బిల్వదళ అభిషేకము**
భోగభాగ్యములు లభించును



**నేరేడు పండ్ల రసాభిషేకము**
వైరాగ్యసిద్ధి లభించును


**కొబ్బరి నీటి అభిషేకము**
సంపదలను కలిగించును


**రుద్రాక్ష జలాభిషేకము**
సకల ఐశ్వర మునిచ్చును


**తేనెతో అభిషేకము**
తేజోవృద్ధి కలుగును


**గరిక నీటితో అభిషేకము**
నష్టమైన ద్రవ్యము తిరిగి పొందుట


**చెరుకు రసాభిషేకము**
ధన వృద్ధి కలుగును


**గంగోదకముతో అభిషేకము**
సత్పుత్ర ప్రాప్తి కలుగును


**బంగారు నీటి అభిషేకము**
ఘోర దారిద్రము నశించును


**కస్తూరి నీటిచే అభిషేకము**
చక్రవర్తిత్వము లభించును


**మామిడి పండ్ల రసాభిషేకము**
దీర్ఘ వ్యాధులు నశించును


**ఆవుపాల అభిషేకము**
సర్వ సుఖాలను ప్రసాదించును


**నవరత్నోదకముచే అభిషేకము**
ధాన్యము, గృహ, గోవృద్ధి


**పసుపు నీటితో అభిషేకము**
శుభకార్యము జరుగును


**మెత్తని చెక్కరతో అభిషేకము**
దు:ఖ నాశనము కలుగును


**నీటితో అభిషేకము**
నష్టమైనవి తిరిగి లభించును


**పుష్పోదకము అభిషేకము**
భూ లాభము కలుగును


**అన్నముతో అభిషేకము**



అధికార ప్రాప్తి, దీర్ఘాయువు లభించును

శివపూజలో అన్నలింగార్చనకు ప్రత్యేక ప్రాధాన్యత కలదు. పెరుగు కలిపిన అన్నముతో శివ లింగానికి మొత్తం అద్ది పూజచేయుదురు. ఆ అద్దిన అన్నాన్ని అర్చనానంతరము ప్రసాదముగా పంచి పెట్టిదరు.

# ఆసిఫాబాద్ పీఠం ఎవరి సొంతం..?



- మున్సిపాలిటీలో పతాకస్థాయికి చేరిన ఉత్కంఠ
- కీలకంగా మారిన స్వతంత్ర అభ్యర్థులు
- పాగా వేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నాలు
- ఎక్స్అఫీషియో ఓట్లపై ఈసీ కొత్త మార్గదర్శకాలు
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ కూటమి రాజకీయం
- నేరుగా పోలింగ్ కేంద్రాలకే అభ్యర్థుల క్యాంపులు..

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మున్సి పల్ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత జిల్లాలో రాజకీయ వేడి కొనసాగుతోంది. చైర్మన్ పీఠాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎంపిక జరుగనున్న నేపథ్యంలో పార్టీలు వ్యూహప్రతి వ్యూహాల్లో మునిగిపోయాయి. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం ప్రకారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు గెలుపొందిన వార్డు కౌన్సిలర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్మన్ ఎన్నిక ఆ తర్వాత వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. ఇందు కోసం సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం సభ్యుల్లో కనీసం సగం మందికిపైగా హాజరు కావాల్సి ఉంటుంది. సంబంధిత చైర్మన్ పదవికి కేటాయించిన రిజర్వేషన్ వర్తించే వార్డు కౌన్సిలర్లు మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంటుంది. పోటీలో ఉన్నవారికి మద్దతుగా చేతులు ఎత్తే విధా నం ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ అభ్యర్థుల కు సమానంగా ఓట్లు వస్తే లాటరీ(డ్రా) ద్వారా విజేతను నిర్ణయిస్తారు. జిల్లాలోని రెండు మున్సిపా లిటీల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఆసిఫాబాద్ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఛైర్మన్ పదవి బీసీ- మహి ళకు కేటాయించారు. ఇందు కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకునేందుకు యత్నిస్తున్నాయి. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి చైర్మన్ పదవి గెలుచుకునేందుకు స్పష్టమైన మెజార్టీ లేదు. రెండు మున్సిపాలిటీ ల్లోనూ ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. చైర్మన్ పదవి ఎంపిక కోసం స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా కాంగ్రెస్ 7 స్థానాల్లో, బీఆర్ఎస్ 9 స్థానాల్లో, స్వతంత్రులు 4 స్థానాల్లో గెలుపొందారు. దీంతో ఇక్కడ చైర్మన్ పీఠాన్ని దక్కించుకొవాలంటే స్వతంత్రుల మద్దతు తప్పనిసరి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 9 స్థానాల్లో బీఆర్ఎస్11 స్థానాల్లో, బీజేపీ 5 స్థానాల్లో, స్వతంత్రులు 4 స్థానాల్లో ఎంఐఎం ఒక స్థానంలో గెలుపొందారు. ఇక్కడ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకొవాలంటే స్వతంత్రులతో పాటు ఇతర పార్టీల మద్దతు తప్పనిసరిగా మారింది. 2మున్సిపాలిటీల్లో ఒకే పరిస్థితి ఉండటంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ ఎస్‌లు చైర్మన్ పీఠం దక్కించుకొవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. మున్సిపల్ చైర్మన్ ఎంపికలో అత్యంత కీలకమైన ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియోగా సభ్యులుగా ఓటు వేయలంటే ఆ మున్సిపాలిటీ పరిధిలో ఓటరుగా నమోదు కావడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల అధికారులకు సర్క్యులర్ జారీ చేసింది. గతంలో రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు రాష్ట్రంలోని ఎక్కడైనా తమకు నచ్చిన లేదా అవసరమున్న చోట ఓటు వేసే వెసులుబాటు ఉండేది. కానీ తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాల ప్రకారం స్థానికంగా ఓటు లేకుండా ఇతర ప్రాంతాల్లో ఓటు వేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. దీంతో జిల్లాలో సమీకరణా లు మారనున్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలలో హంగ్ ఏర్పడడంతో ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారనున్నాయి. తాజాగా ఎన్నికల సంఘం నిబంధనలతో స్థానికంగా ఓటు లేని ప్రజాప్రతినిధులు తమ ఓటును వినియోగించుకోలేరు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఎక్స్‌అఫీషియోగా ఓటు వర్తిస్తుండగా ఎమ్మెల్సీ దండెవిఠల్ గతంలో బీఆర్ఎస్ తరపున గెలవడంతో అయనకు కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్ తరపున ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇతర జిల్లాల్లోని ఎమ్మెల్సీ, ఎంపీలను తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో ఈసీ విడుదల చేసిన ఉత్తర్వులతో ఆశలు గల్లంతయ్యాయి.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కాసిపేట క్రీడాకారుల ఎంపిక



**కాసిపేట, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండలానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన సీఎం కప్ 2026 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు వాలీబాల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పోటీలలో కాసిపేట మండలం జట్టు సెమీ ఫైనల్ దశలో ఓడినప్పటికీ, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు క్రీడాకారులు భూక్య సాయి తేజ(సోమగూడెం), దోసందుల రాజేష్(బుగ్గగూడెం), పల్లె రఘువరణ్ (బుగ్గగూడెం) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు భూక్య రాజన్న తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంఈవో ముక్తావరపు వెంకటేశ్వర స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం మామిడిపల్లి సాంబమూర్తి అభినందించారు.

# ఇంటర్ విద్యార్థిని ప్రసవం

## మగబిడ్డకు జన్మనిచ్చిన మైనర్ బాలిక
## ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని శనివారం మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్మీడియెట్ వృత్తి విద్యాకోర్సు చదువుతోంది. ఎస్సీ వసతిగృహంలో ఉంటూ చదువుకునేది. ఆ తర్వాత హాస్టల్ నుంచి మధ్యలోనే వెళ్లిపోయినట్లు తెలిసింది. అనంతరం ఇంటి నుంచే కళాశాలకు రాకపోకలు చేస్తోంది. కాగా వారం క్రితం బాలికకు ఫిట్స్ రావడంతో కిందపడిపోయింది. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయగా గర్భిణీ అని తేలింది. మూడు రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం వైద్యులు సిజేరియన్ చేసి ప్రసవం చేశారు. బాలిక మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు తక్కువ బరువు ఉండటంతో ఇంక్యుబేటర్‌లో ఉంచినట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. కాగా, ఈ విషయం బాలల సంరక్షణ అధికారులకు తెలియడంతో ఆసుపత్రికి వెళ్లి ఆ బాలిక వివరాలు సేకరించారు. ప్రేమ పేరిట హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు నమ్మించి గర్భిణి చేసి ఓ బిడ్డకు తండ్రయ్యాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంధువులు ఉండడంతో సదరు బాలికతో ఆ యువకుడికి పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ బాలిక వెల్లడించడం లేదని ఐసీపీఎస్ అధికారులు తెలిపారు. విచారణ చేపట్టి బాధ్యుడిపై ఫిర్యాదు చేయనున్నట్లుగా వివరించారు. ప్రస్తుతం ఆ బాలిక వయస్సు 17 ఏళ్లుగా ఉన్నట్లుగా చెప్పారు.

# మహాలక్ష్మీ ఆలయంలో చోరీ

**సారంగాపూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని వంజర్ గ్రామంలోని మహాలక్ష్మీ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగులగొట్టి చొరబడి అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గర్భగుడిలో ఉన్న బీరువా పగులగొట్టి అందులో వెండి వస్తువులతో కలిపి సుమారు రూ. 2 లక్షల విలువ గల ఆభరణాలను చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ అక్కడికి చేరుకుని పరిశీలించారు.

## దేవుడి మీద ఒట్టు వేసిమా
# డబ్బులు తిరిగి ఇవ్వు

**మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికలు ముగిసినప్పటికీ ఆ వేడి ఇంకా చల్లారలేదు. అయితే ఎలాగైనా ఎన్నికల్లో తాము గెలవాలని అభ్యర్థులు ఓటర్లకు వేలాది రూపాయలు పంచారు. అయితే కొన్నిచోట్ల ఎంత డబ్బు వెదజల్లినా గెలుపు సొంతం చేసుకోలేక చతికిలపడ్డ అభ్యర్థులు కూడా ఉన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వీరు ఓటర్లకు పంచిన డబ్బు తిరిగి వసూలు చేస్తున్న ఘటనలు సోషల్ మీడియాలో సంచలనం రేపుతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటన మంచిర్యాలలో చోటు చేసుకుంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి జాడి తిరుపతి, అతని భార్య రూప ఇంటింటికీ తిరిగి తాము పంచిన డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసారు. “ఎలెక్షన్‌లో మాకే ఓటు వేశావా? దేవుడి మీద ఒట్టు వెయ్యి.. లేదంటే మా డబ్బులు మాకు ఇవ్వు..” అంటూ బలవంతంగా వసూలు చేస్తూ.. ఓటర్లను ఇబ్బంది పెట్టారు. కాగా ఈ తతంగాన్ని ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టగా.. అదికాస్తా వైరల్ అవుతోంది. ఎన్నికల్లో డబ్బులు పంచడమే తప్పు అంటే, ఓడిపోయాక తిరిగి బలవంతంగా వసూలు చేయడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పంచాయితీ ఎన్నికల సమయంలో కూడా చోటు చేసుకున్న సంగతి తెలిసిందే.

# చెరువు మధ్యలో మట్టితట్టలు మోసిన శివయ్య

## మహిమాన్విత సిరిచెల్మ శివాలయం

**ఇచ్చోడ, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సిరిచెల్మ అనే చిన్న గ్రామంలో శివుడు లోకకళ్యాణం కోసం చిన్న బాలుడి రూపంలో మట్టితట్టలను మోశాడు. పరమశివుడు స్వయంభువుగా వెలసిన ఈ ఆలయ విశేషాలను తెలుసుకుందాం. సిరిచెల్మ గ్రామంలోని శివాలయంలో శివుడు పార్వతీ సమేతంగా ఇక్కడ స్వయంభువుగా వెలసినట్లు స్థల పురాణం చెబుతోంది. అంతే కాకుండా స్వామి ఈ గ్రామంలో ప్రత్యక్షంగా తిరుగాడటం కూడా జరిగిందని స్థానికులు చెబుతుంటారు.

**ఆలయ స్థలపురాణం...**
సిరిచెల్మ అనే గ్రామం ఉన్న ప్రాంతంలో పిట్టయ్య, నుమ్మవ్వ అనే దంపతులు ఉండేవారు. సంతానం లేని ఆ దంపతులు ఆ గ్రామానికి పశువుల కాపరిగా వచ్చిన ఓ బాలుడు అనాథ అని తెలుసుకుని అతడికి మల్లన్న అని పేరు పెట్టి పెంచుతారు. మల్లన్న వయసులో చిన్నవాడైనా సాయంలో మిన్న. కష్టాల్లో ఉన్నవారికి ఎప్పుడు సాయం చేస్తూ మంచివాడిగా పేరు తెచ్చుకున్న ఆ బాలుడంటే అందరికి ఇష్టమే! ఒక సారి ఆ గ్రామంలో తీవ్ర వర్షాభావం ఏర్పడింది. ప్రజలకు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో మల్లన్న తాను ఒక రోజు లోపల చెరువును తవ్వడమే కాకుండా వర్షాన్ని కూడా కురిపిస్తానని గ్రామ ప్రజలతో చెబుతాడు. అంతేకాకుండా చెరువును తవ్వడం ప్రారంభిస్తాడు. అయితే ఒక రోజు లోపల చెరువును తవ్వడం సాధ్యం కాదని చెబుతూ ఎవరూ మల్లన్నకు సాయం చేయడానికి ముందుకు రాలేదు. అయినా



తగ్గకుండా మల్లన్న చెరువు తవ్వడంలో నిమగ్నమవుతాడు. అర్ధరాత్రి దాటినా మల్లన్న చెరువు తవ్వడం మాత్రం మానలేదు. ఇక మరుసటి రోజు ఉదయం గ్రామస్థులు ఆ చెరువు దగ్గరకు వచ్చి చూసేసరికి చెరువు తవ్వడం పూర్తి అయి ఉంటుంది కానీ ఆ బాలుడు మాత్రం అక్కడ కనిపించడు.

**చెరువు మధ్యలో సాక్షాత్కరించిన శివలింగం...**
చెరువు మధ్య భాగంలో ఒక శివలింగం కూడా ఉంటుంది. అంతేకాకుండా శివలింగంపై భాగంలో కొంతలోనికి వెళ్లినట్లు కనిపిస్తుంది. దీంతో ఆ బాలుడు ఎవరో కాదు శివుడే అని నమ్ముతారు. అంతేకాకుండా ఆ శివుడు తాను గ్రామాన్ని విడిచి పెట్టి పోతూ తన ప్రతి రూపమైన శివలింగాన్ని ఇక్కడ వదిలి వెళ్లాడని భావిస్తారు. రాత్రి మొత్తం ఆ బాలుడు మట్టి తట్టలను మోయడం వల్ల గుంట ఏర్పడిందని స్థానికులు భావించారు.

**శివుడు స్వప్న దర్శనం...**
సంఘటన జరిగిన రోజు రాత్రి పిట్టయ్య దంపతుల కలలో మల్లన్న కనిపించి తనకు ఓ దేవాలయం నిర్మించాల్సిందిగా సూచిస్తాడు. అదే మల్లికార్జున ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ పుణ్యక్షేత్రంలో రెండు నందులు ఉంటాయి. శివరాత్రి రోజు ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆ సమయంలో పార్వతీ సమేతంగా శివుడు ఇక్కడకు వస్తాడని చెబుతారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

# కూలీలకు 'ఉపాధి' భరోసా ఇచ్చేనా?

- మార్చి వరకు పాత విధానంలోనే కొనసాగింపు
- 100 నుంచి 125రోజులకు పని దినాల పెంపు
- జిల్లాలో 1.22లక్షల జాబ్‌కార్డులు


**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసు కొచ్చింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీ జీ రామ్ జీ)గా పేరు మార్చింది. కొత్త నిబంధనలతో వస్తున్న వీబీ జీ రామ్ జీ ద్వారా ఏ మేరకు ఉపాధి లభిస్తుందనే ఆందోళనలు, అయోమయం నెలకొన్నది. జిల్లాలో ఈ పథకం ఏ విధంగా కూలీలకు ఉపయోగపడుతుందని చర్చ మొదలైంది. ఒకవైపు ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడంపై కాంగ్రెస్, ఇతర పార్టీల నిరసనలు కొనసాగుతున్న క్రమంలో ఉపాధి కూలీల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలకు ఉపాధి హామీ పథకం పెద్ద భరోసాగా నిలిచింది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పనులులేక వలసలను నివారించడంలో ప్రయోజనకరంగా మారింది. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టింది. కూలీల హాజరును బట్టి గ్రామాల్లో మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రోడ్లు, రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, హెల్త్ క్లీనిక్‌లు, పంచాయతీ భవనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఉపాధిహామీ పేరు మారడంతో పాటు నిబంధనలు కూడా మార్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏమేరకు పనులు కలుగుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ ఒకవైపు ఉండగా, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ అనుసంధానం నీరుగారి పోతుందనే చర్చ జరుగుతోంది.

**నిధుల కేటాయింపు..**
ఇప్పటివరకు ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు కేటాయిస్తోంది. కానీ వీబీ జీ రామ్‌జీ ద్వారా కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల్లో వాటా భరించాల్సి ఉంటుంది. రాష్ట్రప్రభుత్వానికి నిబంధన ఇబ్బందికరంగా మారుతుందని, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వాటా చెల్లించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో పాటు ఉపా?ధిహామీ పథకం జాబ్ కార్డుల స్థానంలో గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డును ఇవ్వనున్నారు. కార్డు కాలపరిమితి మూడేళ్లు మాత్రమే ఇస్తారు. ప్రత్యేక వర్గాలకు స్పెషల్ కార్డులు మంజూరు చేస్తారు. ప్లానింగ్ విధానంలో మార్పులతో రాష్ట్రాలకు లేబర్ బడ్జెట్ ఉండదు. కేంద్రం నుంచే నిధులు నిర్దేశిస్తారు. డిమాండ్ పెరిగితే అదనపు ఖర్చులను రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది. ఉపాధి పథకం నిర్వహణలో ఏదైనా లోపాలు జరిగితే గతంలో వెయ్యి రూపాయల జరిమానా విధించేవారు. కొత్త



పథకం ద్వారా జరిమానా 10వేల రూపాయలకు పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులపై ఎలా స్పందిస్తుందనేది కూలీల్లో అయోమయంగానే ఉంది.

**2.39లక్షల కూలీలు..**
జిల్లాలో 15మండలాల పరిధిలో 335 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 1.22లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 2.39లక్షల కూలీలు ఉన్నారు. క్రియాశీలక జాబ్‌కార్డులు 88వేలు ఉన్నాయి. ఇందులో 1.61లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డులో నమోదైన కూలీలకు బదులుగా మరొకరు హాజరవుతున్నారని ఆరోపణల నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కాగా ఉపాధిహామీ పథకంలో కూలీలకు వంద రోజులు పని కల్పించాలనే లక్ష్యంగా ప్రస్తుతం ఉంది. వీబీ జీ రామ్ జీ ద్వారా కేంద్ర ప్రభుత్వం పని దినాల పరిమితిని 125రోజులకు పెంచింది. కూలీ 325 రూపాయలకు పెంచే ఆలోచనలో ఉంది. గతంలో ఏడాదిలో 60రోజుల విరామం వ్యవసాయ సీజన్‌ను బట్టి ఇస్తున్నారు. పని దినాలు పెంచాలని డిమాండ్ చాలాకాలంగా ఉన్న నేపథ్యంలో 125రోజులు చేయడం కూలీల నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. దీనికి అనుగుణంగా 2026-27లేబర్ బడ్జెట్‌లో కూడా మార్పులు తేవడానికి కసరత్తు చేస్తున్నారు.



## సామూహిక వివాహాలకు
# వెడ్మ ఫౌండేషన్ విరాళం

**ఉట్నూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలంలోని మహాగావ్ గ్రామంలో సంత్ సురాజీ బాబా ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహ మేళాకు వెడ్మ ఫౌండేషన్ ద్వారా రూ.50వేల నగదును ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరంగ అక్షయ్ అందజేశారు. ప్రత్యేక మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని సంత్ సురోజీ బాబా ఆశ్రమం ఆధ్వర్యంలో పేద యువతి యువకులకు సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే మహా శివరాత్రి సందర్భంగా ఈ ఏడాది 25 జంటలకు సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవతో ఫౌండేషన్ ద్వారా నగదు అందజేయాలని ఆదేశించారు. దీంతో ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరింగ అక్షయ్, సభ్యులు మెస్రం నగేష్, సర్పంచ్ మెస్రం భూపతి, సోయం ముకుంద రావు, మండడి లింగులు శనివారం జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్‌కు నగదు అందజేశారు.

విలేకరులు
కావలెను
ప్రభాత
సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# పాఠశాల వంట గదికి భూమి పూజ

**జైనూర్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మండలం జంగం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో వంట గది నిర్మాణానికి జంగం గ్రామ పంచాయతీ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్న విద్యావ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ఆత్మరం కార్యదర్శి మనోజ్ ఉపసర్పంచ్ సయ్యద్ సజ్జద్ వార్డ్ సభ్యులు సిడం లక్ష్మిన్ గ్రామస్తులు పాల్గొన్నారు.






# క్రీడలతోనే శారీరక దారుఢ్యం

**మందమర్రి, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం కలుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన 2025-26 జిల్లా స్థాయి గేమ్స్‌అండ్ స్పోర్ట్స్ ఎంపిక క్రీడలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, వర్గ విభేదాలు లేని ప్రదేశం ఏదైనా ఉందంటే అది క్రీడా మైదామేనని పేర్కొన్నారు. క్రీడాకారులు వారెంచుకున్న ప్రతి రోజు సాధన చేయడం ద్వారానే విజయాలు సాధిస్తారన్నారు. మందమర్రి జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి పాఠశాల మైదానం క్రీడలకు వేదికగా మారిందన్నారు. అందుకే పాఠశాల మైదానాన్ని అన్ని క్రీడలకు సంబంధించి మెరుగు పరిచామన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలన్నారు. క్రీడా మైదానంలో విద్యుత్ దీపాలు తదితర సౌకర్యాలను కల్పించామన్నారు. క్రీడాకారులను సింగరేణి ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం వారు క్రీడాకారులను పరిచ యం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలం పిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్, సీఐ రమేష్, ఎస్ఐ నరేష్, క్రీడల నిర్వహకులు రాంవేణు, పీడీ రోజా, వరకుమారి, సుకుమార, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

## శబరిమల మహా అన్నదానంలో
# మహిళకు విగ్రహాల సెట్ బహూకరణ

**ముథోల్, ఫిబ్రవరి 14 (ప్రభాత సమాచారం)**
అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ మరియు తత్త్వమసి సేవా సమాజం వారి ఆధ్వర్యంలో శబరి మలలో నవంబర్ 16, 2025 నుండి జనవరి 20, 2026 వరకు నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో భాగంగా లక్కీ డ్రా నిర్వహించారు. ఈ లక్కీ డ్రా లో తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పులి పుష్పలత సంతోష్ మూడవ విజేతగా ఎంపికయ్యారు. విజేతకు విగ్రహాల సెట్ను బాసర శ్రీ జ్ఞాన సరస్వతి మాత ఆలయం పుణ్యక్షేత్రంలో భక్తిశ్ర ద్ధలతో అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్ముద్ర సేవా ట్రస్ట్ సభ్యులు కర్క సిద్దు గురుస్వామి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచోజు సత్యనారాయణ గురుస్వామి, జిడ్డు సుభాష్ గురుస్వామి, జంబుల సాయి ప్రసాద్ గురుస్వామి, రాజుల్ల రాజేష్ కుమార్ గురుస్వామి, ఇర్ప రాజు స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు విజేతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.